


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 04-10-2019 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 22 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## శ్రీవారి గరుడ సేవకు ఏర్పాట్లు పూర్తి

- కట్టుదిట్టమైన భద్రత..
- శ్రీవారికి శ్రీవల్లిపుత్తూరు మాలలు
- టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్



తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల భాగంగా గరుడ వాహన సేవకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సుమారు రెండు లక్షల మంది భక్తులు స్వామివారి గరుడ వాహన సేవను ప్రత్యక్షంగా తిలకించేలా ఏర్పాట్లు చేశామన్నారు. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. మాడ వీధుల్లో 20 ప్రాంతాల్లో, వెలుపల 14 ప్రాంతాల్లో గరుడ సేవను భక్తులు తిలకించడానికి ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశామని అనిల్ సింఘాల్ పేర్కొన్నారు.

**కట్టుదిట్టమైన భద్రత..**

స్వామివారి గరుడ వాహన సేవకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని టీటీడీ సీవీఎస్ఓ గోపీనాథ్ జెట్టి తెలిపారు. సుమారు 4 వేల మంది పోలీసులు, 15000 మంది విజిలెన్స్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. నిరంతరం కంట్రోల్‌రూమ్ నుంచి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తారని పేర్కొన్నారు. 1600 సీసీ కెమెరాలతో గరుడసేవ నిరంతరం పర్యవేక్షణలో ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి గ్యాలరీలలోకి భక్తులను తరువాయి 2లో..

### ఆరు నెలల్లో దళారి వ్యవస్థను

# రూపుమాపాలి

- కమిటీల్లో కూడా సగం మహిళలకే
- అక్టోబరు చివరినాటికి భర్తీ
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు యాభై శాతం రిజర్వేషన్ కల్పించాలి
- ఆరు నెలల్లోగా దళారి వ్యవస్థను నిర్మూలించాలి
- మార్కెటింగ్, సహకార శాఖల సమీక్షలో సీఎం జగన్



తాడేపల్లి: మార్కెట్ యార్డులకు వెంటనే కమిటీల నియామయం జరపాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. కమిటీలలో 50శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సూచించారు. గురువారం ఆయన తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మార్కెటింగ్, సహకార శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు కన్నబాబు, మోపిదేవి వెంకటరమణ, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం జగన్ పలు సూచనలు చేశారు. పంట ప్రారంభంలోనే మద్దతు ధర ప్రకటించాలని ఆదేశించారు. అక్టోబర్ చివరి వారంలోగా పప్పు ధాన్యాలకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. నియోజకవర్గాల స్థాయిలో గోడౌన్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అన్ని పంటలకు ఈనామ్ అమలు చేయాలన్నారు. తరువాయి 2లో..



## అక్టోబర్ 17 వరకూ చిదంబరం కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ : ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పీ చిదంబరం జ్యుడిషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు అక్టోబర్ 17 వరకూ పొడిగించింది. జ్యుడిషియల్ కస్టడీ పొడిగించాలని కోరుతూ దర్యాప్తు సంస్థ సీబీఐ అప్పీల్ చేసింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో చిదంబరంను ఆగస్ట్ 21న సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇంద్రాణి ముఖర్జి, పీటర్ ముఖర్జియాలు అప్రూవర్‌గా మారిన ఈ కేసులో చిదంబరం కుమారుడు కార్తి చిదంబరంపై కూడా అభియోగాలు నమోదయ్యాయి. కాగా ఇంద్రాణి కుమార్తె షీనా బోరా హత్య కేసులో ప్రస్తుతం పీటర్, ఇంద్రాణిలు ముంబై జైలులో ఉన్నారు. ఇక ఐఎన్ఎక్స్ మీడియా కేసులో చిదంబరంపై ఈడీ సైతం 2017లో మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేసింది. మరోవైపు ఐఎన్ఎక్స్ మీడియా కేసులో బెయిల్‌ను కోరుతూ సుప్రీం కోర్టులో గురువారం చిదంబరం తాజాగా అప్పీల్ చేశారు. ఈ బెయిల్ తరువాయి 2లో..

### మృతుల కుటుంబాలకు

# రూ. 90 లక్షల పరిహారం



- బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ
- ఇల్లు, ఉద్యోగం కేటాయిస్తాం
- బోటు ప్రమాద కారణాలు తెలుసుకునేందుకు ఐదుగురు ఐఎఎస్ అధికారులతో ఒక కమిటీ
- పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

విశాఖపట్నం: ఇటీవల పాపికొండల్లో గోదావరి నదిలో మునిగిపోయిన బోటు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు గురువారం సర్క్యూట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.90 లక్షలు చెక్కులను పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కుటుంబాలలో ఇల్లు, ఉద్యోగం లేనివారికి వాటిని కల్పిస్తామన్నారు. మృతులు అందరికీ బీమా మొత్తము కూడా త్వరలోనే వచ్చే ఏర్పాట్లు చేస్తామన్నారు. గత నెలలో గోదావరి నదిలో జరిగిన బోటు ప్రమాదంలో విశాఖపట్నం జిల్లాకు చెందిన 17 మంది ప్రయాణీకులు గల్లంతయ్యారని చెప్పారు. వారిలో తొమ్మిది మందికి మృతునికి రూ. 10 లక్షలు చొప్పున వారి కుటుంబ సభ్యులకు చెల్లిస్తున్నట్లు తెలియజేశారు. 13మంది మృతదేహాలను గుర్తుపట్టగా మరో నలుగురు మృతదేహాలు ఇంకా లభించలేదని తెలిపారు. వీరిలో నలుగురు నెల్లూరు జిల్లాకు చెందిన వారైనందున వారికి ఆ జిల్లా కలెక్టర్ నష్టపరిహారం ఇస్తారన్నారు. ఈ ప్రమాదంపై విచారణ తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఐదుగురు ఐఎఎస్ అధికారులతో తరువాయి 2లో..



## వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

న్యూఢిల్లీ : న్యూఢిల్లీ రైల్వేస్టేషనులో గురువారం కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఢిల్లీ నుంచి కట్రా స్టేషను వరకు నడిచే వందేభారత్ తరువాయి 2లో..




## రైతు ఏ దశలో కూడా నష్టపోరాదు

### ధరల స్థిరీకరణ నిధిని వినియోగించి రైతులకు న్యాయం చేయాలి

### వ్యవసాయ శాఖా మంత్రి కురసాల కన్నబాబు



అమరావతి: ధరల స్థిరీకరణ నిధిని వినియోగించి రైతులకు న్యాయం చేయాలని వ్యవసాయ శాఖా మంత్రి కురసాల కన్నబాబు అధికారులను ఆదేశించారు. అదే విధంగా సహకార శాఖను ఆధునికీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ... నష్టాల్లో ఉన్న డీసీసీబీలను గాడిలో పెట్టి.. బకాయిల వసూళ్లపైనా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. ఈ మేరకు నిపుణుల కమిటీని నియమించనున్నట్లు పేర్కొన్నారు. రైతు ఏ దశలో కూడా నష్టపోకూడదన్నదే సీఎం జగన్ లక్ష్యం. గిట్టుబాటు ధర ఇవ్వకపోతే గ్రామ సచివాలయాల్లో అగ్రికల్చరల్ అసిస్టెంట్‌కి ఫిర్యాదు చేయండి. రైతు భరోసా భారీ సంక్షేమ కార్యక్రమం. అక్టోబర్ 15న ఈ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారు అని తెలిపారు. అదే విధంగా తరువాయి 2లో..

## బొగ్గు కొరతతో విద్యుదుత్పత్తి తగ్గింది

- రాష్ట్రంలో విద్యుత్ కొరత నిజమే..
- విద్యుత్ కొరత, మిగిలిన సమస్యలపై ఆరా
- కేంద్రం, తెలంగాణతో చర్చలు జరుపుతాం
- మంత్రి బొత్స సత్యనారాయణ



అమరావతి: ఏపీని విద్యుత్ కష్టాలు వెంటాడుతున్నాయి. బొగ్గు కొరతతో విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని ప్రభుత్వం చెబుతోంది.. బొగ్గు సరఫరాపై కేంద్రం, తెలంగాణ ముఖ్యమంత్రికి సీఎం జగన్ లేఖలు కూడా రాశారు. అలాగే కేంద్రం నుంచి సహకారం తీసుకుంటున్నారు.. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. విద్యుత్ కొరతపై తాజాగా మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉన్న మాట వాస్తవమేనన్నారు మంత్రి. విద్యుత్ కొరత, మిగిలిన సమస్యలపై.. కేంద్రం, తెలంగాణతో చర్చలు జరుపుతున్నామని బొత్స చెప్పారు. త్వరలోనే సమస్యల్ని పరిష్కారమవుతాయని.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందన్నారు బొత్స. ఇటు ఇసుక కొరత కొత్త పాలసీ అమల్లోకి వచ్చాక తగ్గిందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో నిజం లేదన్నారు. చంద్రబాబుకు గ్రామ సచివాలయాల ఆలోచన వస్తే ఎందుకు అమలు చేయలేదో చెప్పాలన్నారు

బొత్స. ప్రభుత్వంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మినారాయణ చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం అన్నారు. త్వరలోనే ఆస్పత్రుల దగ్గర క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు. మున్సిపల్ ఎన్నికలకు కసరత్తు చేస్తున్నామన్నారు మంత్రి.

# నిరుపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ



అనకాపల్లి : మండలంలోని శంకరం గ్రామాలు క్రిస్టియన్ ఔట్రీచ్ మినిస్ట్రీస్ చిల్డ్రన్ హోమ్ లో జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి వేడుకల్లో భాగంగా పేదలకు బట్టలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పాస్టర్ లు మీ యోహాన్, బి. హెలీ నా దంపతులు గాంధీ పిత మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేం దుకు తమ వంతు విధి గా తమ శక్తి మేరకు సేవా కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫాస్టర్ పి. తిమోతి, సిహెచ్ ప్రకాష్, ఏసుదాసు, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎన్నాళ్ళు... ఈ కష్టాలు

- అటు ఆనందపురం.. ఇటు చోడవరం రోడ్డు
- రెండేళ్లుగా ఇదే పరిస్థితి



దేవరాపల్లి : దేవరాపల్లి నుండి చోడవరం వెళ్ళె మేయిన్ రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉంది పూర్తిగా గతుకులతో రోజు ప్రయాణి కులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వందలాది వాహనాలు రోజు తిగుతున్న, కనీసం రీపెరెంగ్ అయినా చేయలేని దుస్థితిలో, ప్రభుత్వ అధికారులు అధికారులు ఉన్నారు. ఒకప్పుడు ప్రతిపక్షలో ఉన్న ప్రస్తుతం చోడవరం ఎమ్మెల్యే, రోడ్డు రీపెరెంగ్ చేయాలని, గవరవరం నుండి చోడవరం వరకు, పాదయాత్ర చేసారు ఇప్పుడు అదకారంలోకి వచ్చిన తరువాత, కనీసం గోతుల్లో పిడికెడు బుగ్గి ఆయన వెయించలెదు, రోజు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోనే నాదుడే కరువు అయ్యారు. బోయిలకింతాడ గ్రామానికి రెండు వైపులా మరి ప్రమాదకరంగా ఉంది. వర్షం వస్తె చేరువునుతలపించే విదంగా రోడ్డు తయారు అయ్యింది. ఇటు, ఆనంద టపురం, దేవరాపల్లి రోడ్డు మరి దారుణంగా ఉంది ,23 లక్షలు రీపెరెంగ్ గు మంజూరు అయినట్లు ఆధికారులు ప్రకటన చేసిన నేటికీ కనీసం పట్టించుకోవకపోవడం దుర్మార్గం. ప్రజలు సమస్యలు పై అధికారులు స్పందించిన తీరు ,ప్రజలు ను ఉద్య మాలు వైపు పురుగోలేపె విదంగా ఉందని, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న పేర్కొన్నారు.

## సంప్రదాయానికి ఎస్వియు ఎఫ్లియేషన్

శ్రీకాకుళం : జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి "సంప్ర దాయం' సంగీత, నాట్య కళాగురుకులంకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థగా గుర్తింపు లభించిందని గురుకులం సంచాలకులు స్వాతి సోమనాథ్ గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగీతం, నాట్య రంగాల్లో ఉత్తమ శిక్షణ కల్పించుటకు ఏర్పాటు చేసిన ఈ సంస్థకు శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం అనుబంధ సంస్థగా గుర్తంపు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాది ఆగష్టు 1వ తేదీ నుండి కూచిపూడి, కర్ణాటక సంగీతంలో శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయని ఆమె వివరించారు. రెసిడెన్షియల్, డే స్కాలర్ విద్యార్థులు మొత్తం 70 మంది తమ సంస్థలో సంగీత, నాట్య విద్యను అభ్యశిస్తున్నారని చెప్పారు. ఇటువంటి సంస్థకు అనుబంధ సంస్థగా స్థానం లభిం చడం వలన శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గుర్తింపు కలిగిన విశ్వవిద్యాలయ సర్టిఫికేట్లు జారీ అవుతాయని చెప్పారు. తద్వారా విద్యార్థులు ఉన్నత కోర్సులలో చేరుటకు, ఉద్యోగ నియామ కాలను పొందుటకు సులభం అవుతుందని వివరించారు.

### అన్నవరం దేవస్థానం తరపున
## *విజయవాడ కనకదుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ*

- కనకదుర్గమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన దేవస్థానం ఈవో వి.త్రినాధరావు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తరపున దసరా ఉత్సవాలలో భాగంగా విజయవాడ శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ అమ్మ వారికి గురువారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు పట్టు వస్త్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా ఈవో త్రినాధ రావును విజయవాడ దేవస్థానం ఈవో సురేష్ బాబు ఆలయ మర్యా దలతో ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రసాద్, సూపరింటెండెంట్ అనకాపల్లి ప్రసాద్, గంటా. విష్ణు, ఆలయ ప్రధాన అర్చకులు కోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మందుబాబుకు జైలుశిక్ష

దేవరాపల్లి : దేవరాపల్లి నాయుడు వీధికి చెందిన వరదపురెడ్డి మరిడినాయుడు అనే వ్యక్తి బుధవారం రాత్రి సమయంలో మద్యం తాగి చుట్టుపక్కల ఉన్న వీధి వాసులను భయ బ్రాంతులకు గురి చేయడంతో పక్కన ఉన్న స్థానికులు పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ పి. నరసింహమూర్తి అతనిని అదుపులోకి తీసు కొని ప్రజాశాంతి కి భంగం కలిగిస్తాడని అదుపులోకి తీసుకున్న ఎస్సై డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించి గురువారం చోడవరం కోర్టుకు తరలించగా చోడవరం కోర్టు మెజిస్ట్రేట్ మందు బాబుకు 20 రోజులు జైలు శిక్షను ఖరారు చేశారని ఎస్ఐ తెలిపారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ప్రభుత్వ విప్ బూడి



దేవరాపల్లి : ప్రతి పేద ప్రజల కష్టాలను నాడు పాదయాత్రలో తెలుసుకున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేడు ప్రతి పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నవరత్నాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటా ఆనందాల వెల్లివిరిసే విధంగా ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందని ప్రభుత్వ విప్ మాడుగుల నియోజకవర్గం ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో ఆదరణ పథకం లో 36 మంది రజకు లకు చెక్కులు పంపిణీ చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందు తాయని ఆయన అన్నారు. అలాగే నూతన ప్రభుత్వానికి పని చేసేం దుకు ఇటీవలే సచివాలయం పరీక్షలలో ప్రతిభ కనబరి చిన ప్రతి ఒక్కరికి జగనన్న ప్రభు త్వం లో పని చేసే అవకాశం కలగడం చాలా గొప్ప విషయం అని అలాగే ఈ ఉద్యో గాలతో ఇటు ప్రభుత్వానికి చక్కని పేరు ప్రఖ్యాతులు కలిగే విధంగా ప్రతి ఒక్కరూ లక్ష్య సాధనతో పనిచేయాలని అన్నారు.

ఈ కార్య క్రమంలో మండల ప్రత్యేక అధికారి జి. మహాలక్ష్మి, ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, వైకాపా నాయకులు మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, మండల వైయస్ఆర్ సీపీ యువ జన విభాగం అధ్యక్షులు బూరే. బాబురావు, జి.వి.రమణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### గజపతినగరంలో ఘనంగా
## భవానీ మాలధారుల సన్నిధానం



గజపతినగరంలో సన్నిదాన పూజలో పాల్గొన్న భవానీ మాలధారులు

చోడవరం : దుర్గాదేవి నవ రాత్రి మహోత్సవాలలో భాగంగా మండలంలోని గజ పతినగరం గ్రామంలో భవానీ మాలధారుల సన్నిదాన పూజా కార్యక్రమం బుధవారం రాత్రి అత్యంత భక్తి, శ్రద్దలతో వైభ వంగా జరిగింది. భవానీ మాల ధారులు, గ్రామ పెద్దలు, భక్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్నిదాన కార్యక్రమానికి చోడవరం, కె.కోటపాడు, సబ్బ వరం, తదితర మండలాలకు చెందిన సుమారు రెండు వేలకు పైగా భవానీ మాలధారులు పాల్గొని, దుర్గాదేవి అమ్మవారికి విశేష పూజలు, భక్తి భజన పాటలు ఆలపించారు. అనంతరం భవానీ మాలధారులకు, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

### అనిల్ నీరుకొండ హస్పిటల్‌లో
## క్యాథ్ ల్యాబ్ విభాగం ప్రారంభం



భీమునిపట్నం : అనిల్ నీరుకొండ హస్పిటల్, సంగివలస లో గురువారం గుండెసంబంధిత విభాగం మరియు క్యాథ్ ల్యాబ్ ప్రారంబిం చారు. అతి తక్కువ ఖర్చుతో ఎంజియొగ్రాం మరియు స్టంట్స్ అనుభవజ్ఞులైన డాక్టర్ల మరియు సిబ్బంది పర్య వేక్షణలో జరిగింది. ప్రతీ మంగళవారం, గురువారం మరియు శనివారం గుండె సంబందిత స్పెషలిస్ట్ డాక్టర్లు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అందుబాటులో ఉంటారనీ నిర్వహుకు లు తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు డా.అఫ్రాజ్ ఫరూకీ, సిటీ సర్జరీ విభాగాదిపతి, అపోలో హస్పిటల్, ముఖ్య అతిధిగా హాజరు అయ్యారు. ఈ వేడు కలో అనిల్ నీరుకొండ విద్యా సంస్థల చైర్మన్ నీరు కొండ ప్రసాద్, ఎన్ ఆర్ ఐ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కల్పన సుబ్రమణ్యం, అనిల్ నీరు కొండ హస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.బి యస్. క్రిష్ణమ్మ, మరియు డాక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గోన్నారు.

ఇందులో భాగంగా అనిల్ నీరుకొండ విద్యా సంస్థల చైర్మన్ డా.నీరుకొండ ప్రసాద్ మాట్లాడుతూ 1000 పడకల అనిల్ నీరుకొండ హస్పిటల్ అంచెలు అంచెలు గా అభివృధి చేయడం జరుగుతుందని, స్పెషలిటీ విభాగాలతో పాటు సూపర్ స్పెషలిటీ విభాగాలు కూడా అందు బాటులో ఉన్నాయని, 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉంటారని నార్మల్ మరియు సిజిరియన్ డెలివరీలు, జనరల్ సర్జరి ఆప రేషన్లు, న్యూరో సర్జరి ఆపరేషన్లు జరుగుతు న్నాయని మరియు కిడ్నీ వ్యాధి గ్రస్థుల నిమిత్తం డయాలసిస్ విభాగం కూడా అందుబాటులో ఉన్నదని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియో గం చేసుకోవలసింది గా తెలియచేశారు.

మొదటి పేజీ తరువాయి

## ఆరు నెలల్లో దళారి వ్యవస్థను రూపుమాపాలి

ఆరు నెలల్లో దళారి వ్యవస్థను రూపుమాపాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు. పంటలకు లభిస్తున్న ధరలు, మార్కెట్లపై నిరంతర సమాచారం

మూడు మార్గాల్లో వ్యవసాయ ఉత్పత్తులు, వాటికున్న డిమాండ్, వివిధ ప్రాంతాల్లో ధరలపై ఎప్పటికప్పుడు సమాచారం. ఇప్పుడున్న అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలు, అగ్రివాచ్ సహా మరో ఏజెన్సీ ఏర్పాటుకు గత సమీక్షలో సీఎం నిర్ణయం, దీనిపై ప్రతిపాదనలు వివరించిన అధికారులు. వ్యవసాయ ఉత్పత్తుల భవిష్యత్ ధరలు, బిజినెస్ కన్సల్టెన్సీ, ధరల స్థిరీకరణ నిధి నిర్వహణ, వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువ జోడించడం ఈ ఏజెన్సీ విధులుగా ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. నిపుణులను ఇందులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పప్పు ధాన్యాల కొనుగోళ్ల కోసం కేంద్రాలు తెరవాలన్నారు. కొనుగోలు కేంద్రాలపై ముఖ్యమంత్రి ఆరాతీశారు. అన్ని పంటల వివరాలను ఆన్‌లైన్లో రైతులు నమోదు చేయించుకోవాలని అధికారులకు సూచించారు. ఆరుతడి పంటలపై అక్టోబరు 10 నుంచి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. అక్టోబరు 15 నుంచి కొనుగోలు ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు. ధరల స్థిరీకరణ, మార్కెట్లో ప్రభుత్వ జోక్యం చేసుకుంటుందన్నారు. 85 రైతు బజార్లలో రూ.25 లకే కిలో ఉల్లిపాయలు విక్రయించామని అధికారులు తెలియజేశారు. 660 మెట్రిక్ టన్నులు వినియోగదారులకు ఇచ్చామని వారు తెలిపారు. రూ. 32 లకే కిలో ఉల్లి ధరను అదుపు చేయగలిగామని, వినియోగదారులకు అందుబాటులో ఉంచామన్నారు. మళ్లీ ధరలు పెరిగిన క్రమంలో ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు సరిపడా నిల్వలు ఉన్నాయా? లేదా? అని అధికారులను సీఎం జగన్ ఆరా తీయగా.. సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు సమాధానమిచ్చారు. టమోటా రైతులను కూడా ఆదుకున్నామన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో మార్కెటింగ్ అవకాశాలు చూసి ఆమేరకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

చిరు ధాన్యాల హబ్‌గా రాయలసీమ

రాయలసీమ ప్రాంతాన్ని మిల్లెట్స్ హబ్‌గా మార్చాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. 9 నెలలపాటు గ్రీన్ కవర్ ఉండేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. మిల్లెట్స్ బోర్డులో కూడా నిపుణులకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. వ్యవసాయ విధానాలు, మార్కెటింగ్, ప్రాసెసింగ్ అన్నీ బోర్డు పరిధిలో ఉంచాలన్నారు. మిల్లెట్స్ బోర్డు విధివిధానాలపై సమావేశంలో చర్చ, అక్టోబరు చివరి నాటికి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

పంటలు వేసేముందే.. ధరలప్రకటన

కందులు, మినుములు, పెసలు, శెనగలు, టమోటా, పత్తి పంటలకు భవిష్యత్తు ధరలు ఎలా ఉంటాయన్నదానిపై సమావేశంలో చర్చించారు. ధరల విషయంలో ప్రభుత్వం జోక్యంచేసుకున్న తర్వాత పరిస్థితి కచ్చితంగా మారాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతులకు కచ్చితంగా భరోసా ఇచ్చామన్న నమ్మకం కలిగించగలగాలన్నారు. పంట వేసినప్పుడు వాటికి ధరలు ప్రకటించే పరిస్థితి ఉండాలని సీఎం జగన్ ఆదేశించారు. ఆ ధర ఏమాత్రం తగ్గుతున్నా.. ఆదుకోవడానికి తగిన ప్రణాళికలతో ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని సూచించారు. దళారీలకు పంటలను తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండకూడదని సీఎం తెలియజేశారు. పంటల దిగుబడులు కూడా ఏస్థాయిలో ఉంటాయన్నదానిపై అంచనాలు రూపొందించాలన్నారు.

సహకార బ్యాంకులు, సహకార రంగం పటిష్టానికి చర్యలు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నష్టాలపై ఒక కమిటీ వేయాలని జగన్ ఆదేశించారు. వాటిని తిరిగి బలోపేతం చేయడంపై కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న సమస్యలు, దీన్ని పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రణాళిక తయారుచేయాలన్నది సీఎం ఆశయం. అవినీతి, పక్షపాతానికి తావులేని విధానంగా ఉండాలన్నారు. సహకారరంగాన్ని పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరించాలని కోరారు. ఈ వ్యవస్థని బాగుచేయడానికి ఏంచేయాలో అదిచేద్దామని సీఎం అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కంప్యూటరీకరించే దిశగా చర్యలు తీసుకుంటామని సీఎఠ్ సూచించారు. ఇందుకు ప్రతిష్టాత్మక సంస్థతో సమగ్ర పరిశీలన, అధ్యయనం చేయించాలన్నారు. చేనేత రంగానికి సంబంధించి ఆప్కో పునరుద్ధరణ, బలోపేతంపైనకూడా అధ్యయనం చేయించాలని సీఎం ఆదేశించారు. నిర్ణీత కాలవ్యవధిలోగా ఈ ప్రక్రియ పూర్తికావాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారు. 6 నెలల్లో మొత్తం అధ్యయనం, సిఫార్సుల అమలు మొదలు కావాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## శ్రీవారి గరుడ సేవకు ఏర్పాట్లు పూర్తి

అనుమతిస్తామని గోపీనాథ్ తెలిపారు.

తిరుమల శ్రీవారికి శ్రీవల్లిపుత్తూరు మాలలు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవలో స్వామివారికి అలంకరించేందుకు తమిళనాడులోని శ్రీవల్లిపుత్తూరు నుండి గోదాదేవి మాలలు గురువారం తిరుమలకు చేరుకున్నాయి. ముందుగా తిరుమలలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీ పెద్దజీయంగార్ మఠానికి మాలలను తీసుకొచ్చారు. అక్కడ శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడినుంచి టీటీడీ అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడవీధుల గుండా ఊరేగింపుగా గోదాదేవి మాలలను శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు. శ్రీవారి ఆలయం ముందు గోదాదేవి మాలలకు టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, సివిఎస్వో గోపినాథ్ జెట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవల్లిపుత్తూరులో గోదాదేవికి అలంకరించిన మాలలను గరుడసేవ రోజు స్వామివారికి అలంకరించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. శ్రీవల్లిపుత్తూరులోని శ్రీరంగమన్నార్‌స్వామి వారి ఆలయానికి గోదాదేవి తండ్రి పెరియాళ్వార్ పుష్ప కంకైర్యం చేసేవారనీ, రంగనాథునిపై అత్యంత భక్తి కలిగిన గోదాదేవి పూలమాలలను మొదట తాను ధరించి తరువాత స్వామివారికి పంపేదని పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన పెరియాళ్వార్ తన కుమార్తెను మందలించారని, ఆ తరువాత గోదాదేవి ధరించకుండా పంపిన మాలలను శ్రీరంగనాథుడు తిరస్కరించినట్టు పురాణాలు చెబుతున్నాయని అన్నారు. గోదాదేవి శ్రీవారి దేవేరి అయిన భూదేవి అవతారమని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారిరి ఆలయ డెప్యూటీ ఈవో, వీఎస్వో మనోహర్, గురురాజారావు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 17 వరకూ చిదంబరం కస్టడీ పొడిగింపు

పిటిషన్‌ను తక్షణమే విచారించాలని చిదంబరం తరపు న్యాయవాది సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ సంజీవ్ ఖన్నా,జస్టిస్ కృష్ణ మురారిలతో కూడిన సుప్రీం బెంచ్‌ను కోరారు.

## మృతుల కుటుంబాలకు రూ. 90 లక్షల పరిహారం

ఒక కమిటీని వేసినట్లు వెల్లడించారు. అనకాపల్లి మండలానికి చెందిన ముగ్గురు, పెందుర్తి మండలం ఇద్దరు, విశాఖ రూరల్ ఒకరు, గోపాలపట్నం ఒకరు, మహారాణిపేట ఇద్దరు మృతులకు చెందిన కుటుంబాలకు చెక్కుల పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, కలెక్టర్ వి వినయ్ చంద్, శాసనసభ్యులు గుడివాడ అమర్‌నాథ్, కరణం ధర్మశ్రీ, అన్నం రెడ్డి అదీప్ రాజ్, తిప్పల నాగిరెడ్డి, ఆర్డీవో పెంచల కిషోర్, తాసిల్దార్ లు పి రామారావు, వై యస్ వి వి ప్రసాద్ రావు, బి వి రాణి, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఏ దశలో కూడా నష్టపోరాదు

అక్టోబర్ 15 నుంచి అపరాల కొనుగోలు ప్రారంభిస్తామని మంత్రి కన్నబాబు తెలిపారు. ఫామాయిల్‌కు తెలంగాణాలో ఉన్న ధరనే రాష్ట్రంలో కూడా అమలు చేయాలని సీఎం జగన్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. అంతేగాకుండా ఫామాయిల్ ధర రూ. 10వేలు చేయాలని విన్నవిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం లేఖ రాశారని తెలిపారు. కాగా నేతన్నలకు మేలు చేకూర్చేవిధంగా ఆప్కో సంస్కరణల కోసం కూడా నిపుణుల కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

## వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

ఎక్స్‌ప్రెస్ రైలును అమిత్ షా గురువారం న్యూఢిల్లీ రైల్వేస్టేషను నుంచి ప్రారంభించారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం జమ్మూకశ్మీర్‌కు పెద్ద బహుమతి అని ఈ సందర్భంగా కేంద్రమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. వైష్ణో దేవి ఆలయానికి వెళ్లే యాత్రికులకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ వల్ల ప్రయాణసమయం నాలుగు గంటలు తగ్గుతుందని మంత్రి చెప్పారు. గత నెలలోనే ఢిల్లీ-కట్రా మార్గంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రయల్ రన్ పూర్తి చేశామని రైల్వేబోర్డు ఛైర్మన్ వినోద్ కుమార్ యాదవ్ చెప్పారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా యాత్రికులకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ బహుమతిగా ఇస్తున్నామని రైల్వేబోర్డు ఛైర్మన్ పేర్కొన్నారు. దేశంలో రద్దీగా ఉన్న ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-హౌరా రైలుమార్గాల్లోనూ డిసెంబరుకల్లా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతామని ఆయన తెలిపారు. మేక్ ఇన్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా దేశంలో 2022 కల్లా 40 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వినోద్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ తోపాటు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## నేడు ఇంద్రకీలాద్రికి సీఎం జగన్



విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకోనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. 5న ఢిల్లీ పర్యటన ఉన్న కారణంగా ముందు రోజే ముఖ్యమంత్రి ఇంద్రకీలాద్రికి వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ**

సీఎం జగన్ నేడు సాయంత్రం దుర్గమ్మవారిని దర్శించుకొనున్న నేపథ్యంలో డీసీపీ విజయరావు నేడు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకాశం బ్యారేజ్ మీదుగా ముఖ్యమంత్రి దుర్గగుడికి చేరుకుంటారని, ఓంకారం వద్ద మంత్రులు సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతారని తెలిపారు. అనంతరం సాంప్రదాయ పద్ధతిలో సీఎం జగన్ పట్టు వస్త్రాలు తీసుకువచ్చి దుర్గమ్మకు సమర్పిస్తారని చెప్పారు. అమ్మవారిని ముఖ్యమంత్రి దర్శించుకునే సమయంలో సాధారణ, 100 టికెట్ క్యూలైన్లు యథావిధిగా నడుస్తాయని.. వీఐపీ క్యూలైన్లు మాత్రమే నిలిపివేస్తామన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఘాట్ రోడ్ పైకి ఏవిధమైన వాహనాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. 5న ఢిల్లీకి సీఎం జగన్ అక్టోబరు 5న ఉదయం 9:30 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లనున్నారు. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అవుతారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ప్రధానితో చర్చించనున్నారు.

### *5వ తేదీ నుండి నాణ్యమైన బియ్యం పంపిణీ - జె సి*

శ్రీకాకుళం : జిల్లాలో నాణ్యమైన బియ్యం పంపిణీని అక్టోబర్ నెల 5వ తేదీ నుండి చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ డా కె. శ్రీనివాసులు గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన బియ్యం పంపిణీకి వాలంటీర్లతో ప్రజలు సహకరించాలని కోరారు. 5వ తేదీ నుండి పంపిణీ చేపట్టి 7వ తేదీ నాటికి పూర్తి చేయుటకు ప్రయత్నిస్తున్నామని జేసీ చెప్పారు. తెల్ల రేషన్ కార్డు దారులు గమనించాలని ఆయన కోరారు. వాలంటీర్లు కుటుంబాల జాబితా సిద్ధంగా ఉంచాలని అన్నారు.

## డ్రై-ఇన్ రెస్టారెంటులు ప్రవేటికరణ చెయ్యరాదు

**కార్మికులు ఆందోళన**




అరకులోయః అరకులోయ మండలం, ఆంధ్రపదేశ్ పర్యాటక శాఖ విశాఖ ఏజెన్సీ 5 యూనిట్లలో పనిచేస్తున్న కార్మికులు, అరకు లోయ హరిత రిసార్టులు,అనంతగిరి,బొర్రా,తైడ జంగిల్ బెల్స్ నందు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, దినసరి, గార్డెన్, సెక్యూరిటీ సిబ్బందిలు కలసి డ్రైఇన్ రెస్టారెంటులు ప్రవేటు కరణ చెయ్యరాదని బుధవారం నాడు ఆందోళనలకు దిగారు.ఈ ఆందోళనలో కార్మికులు నల్లబ్యాడ్జీలు దరించి నిరసనలు తెలుపుతూ విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా టూరిజం సంస్థలు ప్రవేటికరణ చెయ్యరాదని,నూతనంగా నిర్మించిన రెస్టారెంట్లు నేరుగా టూరిజం యాజమాన్యమే నడపాలని,లేనిచో 5 యూనిట్లలో పనిచేస్తున్న కార్మికులు ఎప్పుడైనా ఏ సమయంలో నైన ఆందోళన చేయ్యుటకు వెనకడుగు వేయ్యబోమనీ నల్లబ్యాడ్జీలతో నిరసనలు ద్వారా ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంగరాజు, బాబురావు, జాన్, సంజీవరావు, లక్ష్మి, లొలోత్. సదాశివ, సోములు, కృష్ణ, బొండం నాయుడు, మురళి, కోటి, గౌరి, చంద్రమ్మ, సదా తదితర ఉద్యోగులు పాల్గోన్నారు.

## విజేతలకు బహుమతుల పంపిణీ



గాజువాక : జీవీయంసీ 52వ వార్డు ఎస్సీ కాలనీలో శ్రీదుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సంధర్బంగా చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన నాయకులు ముమ్మనమురళీ పాల్గొని అందజేసారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ చిన్నారులకు విలువలతో కూడిన విద్యతో పాటు క్రీడల పట్ల మక్కువ పెరిగేలాగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు, పెంటారావు, తులశీదాస్, శ్రీనివాసరెడ్డి పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



సింహాచలం: సింహగిరిపై వేంచేసి ఉన్న సింహాద్రి అప్పన్నని గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మరియు ఆర్ టీ ఏ కమీషనర్ అయాలపురం రాజా తదితరులు దర్శించుకున్నారు. సింహగిరి చేరుకున్న వీరికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. వెంకటేశ్వరరావు ఘనస్వాగతం పలికారు. అర్చకస్వాములు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు.

కప్పస్తంభం ఆలింగనం అనంతరం స్వామివారికి తమగోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. అధికారులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్ధప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పెందుర్తి ఎం ఎల్ ఏ అధీప్ రాజు, దాసరి రాజు, 72వ వార్డు వైకాపా అధ్యక్షులు కొలుసు ఈశ్వరరావు, నడింపల్లి ఆంజనేయ రాజు, గంట్ల కిరణ్, ఎర్ర వరంబాబు, కర్రి సత్తిబాబు, దాసరి కనకరాజు, రచ్చ ఆనంద్ వర్మ, కిషోర్ రెడ్డి, మంథా కళిబాబు, ఇతర వైసీపీ నాయకులు అయనవెంట ఉన్నారు.

## ఐసిఐసిఐ బ్యాంకుకు 35 మంది గీతం విద్యార్థుల ఎంపిక



సాగర్‌నగర్ః ప్రాంగణ నియామకాలలో సరికొత్త రికార్డును సొంతం చేసుకునే దిశగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం దూసుకుపోతోంది. ఇప్పటికే ఇంజనీరింగ్ ప్రాంగణ నియామకాల సంఖ్య వెయ్యికి చేరుతుండగా ఎంబిఎ విద్యార్థులు సమానంగా సత్తా చాటుతున్నారు.

గత కొద్ది రోజులుగా ప్రముఖ బ్యాంకు ఐసిఐసిఐ బ్యాంకు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో నిర్వహిస్తున్న ప్రాంగణ నియామకాలలో మొత్తం 35 మంది ఎంబిఎ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ప్లేస్‌మెంట్ విభాగం చైర్ పర్సన్ కె.వి.ఉమాదేవి తెలిపారు.

విద్యార్థులందరూ డిప్యూటీ మేనేజర్ స్థాయి ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ఆమె పేర్కొన్నారు. దీనితో పాటు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఏసియన్ పెయింట్స్ సంస్థలలో మరికొందరు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు.

ఎంబిఎ విద్యార్థులకు ప్రాంగణ నియామకాల నిమిత్తం ఆదిత్య బిర్లా, ఐటిసి, హిందుస్థాన్ లీవర్, నెస్లే సహ 50 కంపెనీలు ఇప్పటికే తేదీలను ఖరారు చేశాయన్నారు.

కాగా ప్రాంగణ నియామకాలలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ ప్రొఫెసర్ వై.గౌతమ్ రావు అభినందించారు.

## 46వ వార్డు ఏదురువానిపాలెంలో ప్రజావేదిక



సింథియా (ములగాడ): పారిశ్రామికప్రాంతం జీవీయంసీ 47వ వార్డు ఏదురువానిపాలెంలో గురువారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలవలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వాటిని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. చెప్పిందోకటి చేసిందొకటి అన్న చందంగా ప్రభుత్వం నిర్ణయాలున్నాయని మండిపడ్డారు. ముఖ్యంగా అన్నకేంటీన్‌లను మూసివేసి పేదవాడికి పట్టిడన్నం దొరకని పరిస్థితిని తీసుకొచ్చిందని, అలాగే ఇసుకను అందుబాటులోనికి తీసుకురాకపోవడంవలన భవననిర్మాణ కార్మికులు రొడ్డున పడ్డారని ప్రభుత్వం పై ద్వజమెత్తారు. నోటితో చెప్పడం తప్ప చేతలలో చూపని చేతకాని ప్రభుత్వం వైకాపా ప్రభుత్వం అని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి వైయస్‌జగన్ ప్రజరంజకపాలనకు శ్రీకారం చుట్టి ప్రజల మన్నలను పొందాలని ఏద్దేవ చేసారు. ఈ కార్యక్రమంలో జింకుఆంజినేయస్వామి ఆలయ మాజీ చైర్యపర్సన్ కొత్తపల్లి ప్రభావతి, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుకను సరఫరా చేయడంలో వైకాపా ప్రభుత్వం విఫలం



గాజువాక: రాష్ట్ర ప్రజలకు సరసమైన ధరలో, నిత్యం అందుబాటులో ఉండే విధంగా ఇసుకను అందించడంలో వైకాపా ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏజీ స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేసారు. గురువారం అగనంపూడి ఈ మర్రిపాలెంలోని ఇసుక రేవు వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా ఉద్దేశించి స్టాలిన్ మాట్లాడుతూ ఇసుక దొరకక అసంఘటిత కార్మికులు పస్తులు పడుతున్నారని ఆవేదనలను వ్యక్తం చేసారు. రాష్ట్రంలోని 13జిల్లాలో ఎక్కడా ఇసుక దొరక నిర్మాణరంగం కుదేలైందని, దీనివలన భవననిర్మాణ కార్మికులు రొడ్డున పడ్డారని దీనికి కారణం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని మండిపడ్డారు. రూ. 25వేల విలువ చేసే ఇసుక లారీ లక్షరుపాయలలో బ్లాక్‌లో కొనవలసి పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ పరిస్థితి ఈలానే కొనసాగితే భవననిర్మాణరంగ కార్మికులు ఆత్మహత్యలే శరణ్యంమని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి తక్షణమే ఇసుకను అందుబాటులోనికి తీసుకురావాలని డిమాండ్ చేసారు. లేని యెడల ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే పరిస్థితి నెలకొంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ నాయకులు కసిరెడ్డి సత్యన్నారాయణ, టిఎస్ సాంబమూర్తి, ఏ.విష్ణు, కె.పోలారావు, రామారావు, సూర్యనారాయణ అచ్చుతరావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్లు పొడిగింపునకు డి.ఎం.ఎ.సి. సమావేశం

**జాయింట్ కలెక్టర్-2 ఎం.వి. సూర్యకళ**



విశాఖపట్నంః జర్నలిస్టుల అక్రిడిటేషన్లు పొడిగింపు విషయమై డి.ఎం.ఎ.సి. సమావేశం నిర్వహించినట్లు జాయింట్ కలెక్టర్-2 ఎం.వి. సూర్యకళ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్- 2 చాంబర్‌లో జర్నలిస్టుల అక్రిడిటేషన్ పొడిగింపు పై మీడియా అక్రిడిటేషన్ల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలపై జిల్లా జర్నలిస్టుల అక్రిడిటేషన్ల కమిటీ సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. అక్రిడిటేషన్లు అక్టోబరు నెల నుండి డిశంబరు నెల 31 వరకు పొడిగింపు విషయమై జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్లు గడువు సెప్టెంబరు 30తో పూర్తి అయినదని, అక్టోబరు 1 నుండి డిశంబరు 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు అమలు విషయమై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో సమాచార శాఖ ఉప సంచాలకులు, డిఎంఎసి కన్వీనర్ వి. మణిరాం, డి.ఎం.ఎ.సి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, కె. చంద్రరావు, రవికాంత్, పి. సత్యనారాయణ, ఆర్.టి.సి. నుండి ఉదయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు సేవాదృక్పధంతో వైద్యం అందించాలి



గాజువాక: వైద్యులు వ్యాపారదోరణితో కాకుండా సేవలతో కూడిన వైద్యాన్ని అందించి మంచి వైద్యులుగా గుర్తింపు తెచ్చుకోవాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి సూచించారు. జీవీయంసీ 58వ వార్డు కూర్మన్నపాలెం కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన డెంటల్ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగాపాల్గొని మాట్లాడుతూ వైద్యుడు దేవుడుతో సమానమని అటువంటి వైద్యుడు వ్యాపారదృక్పదాన్ని విడనాడి సేవాదృక్పదంతో వైద్యవృత్తిని కొనసాగించాలని, పేద, బడుగు బలహీన వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా వైద్యులు వైద్యవృత్తిని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ వి.వి.యం.రాజా, తదితరులు పాల్గొన్నారు.

## లలితా త్రిపురసుందరిదేవిగా కనకదుర్గాదేవి



సింథియా (ములగాడ): పారిశ్రామికప్రాంతం జీవీయంసీ 47వ వార్డు లక్ష్మీనరగ్‌లో దుర్గాగణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీదుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా 5వ రోజు గురువారం అమ్మవారు లలితా త్రిపురాసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుల సమక్షంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు అమ్మవారిని దర్శించుకొని, ప్రసాదాలను స్వీకరించారు. ఈ సంధర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతీ ఏడాది శ్రీదుర్గాదేవి నవరాత్రిమహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పిసిఎల్ విస్తరణలో స్థానికులకు 75శాతం ఉపాధి ఇవ్వాలి

- కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్నారు
- ఉపాధి లేక స్థానిక యువత తీవ్ర ఆవేదన
- మత్స్యకారులు భూములిచ్చి నిర్వాసితులయ్యారు
- సిఐటియు డిమాండ్




విశాఖపట్నంః పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉపాధి కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో చట్టం చేసింది. ఇది హర్షనీయం. కానీ హెచ్‌పిసిఎల్‌లో, ఎన్ఎఓబి, కోరమాండల్‌లో ఈ చట్టం అమలు కావటం లేదు. ప్రభుత్వం తను చేసిన చట్టం అమలు చేయిస్తేనే స్థానికులకు న్యాయం జరుగుతుంది. కనుక ఈ చట్టం అమలు చేయించి స్థానికులకు 75శాతం ఉపాధి కల్పించాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నది.

హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పిసిఎల్)లో 28వేల కోట్ల రూపాయలు పెట్టుబడితో యాజమాన్యం విస్తరణ చేపడుతోంది.

ఈ ప్రాంతంలో అత్యంత నైపుణ్యం గల ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు, వెల్డర్లు, ప్యాబ్రీకేటర్లు, ఎలక్ట్రిషియన్లు, రిగ్గర్లు, గ్రైండర్లు, గ్యాస్‌కట్టర్లు ఉన్నారు. వీరికి ఇక్కడ ఉపాధి కల్పించడం లేదు. దీంతో వీరు ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు కుటుంబాలను విడిచిపెట్టి వెళ్ళాల్సిన దుస్థితి ఏర్పడింది.

హెచ్‌పిసిఎల్ విస్తరణ పనులకు యాజమాన్యం, ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులకు 75శాతం ఉపాధి కల్పించాలన్న కార్మిక సంఘాలు, రాజకీయపార్టీలు, ప్రజల డిమాండ్‌ను నాడు హెచ్‌పిసిఎల్ యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు అంగీకరించారు. కానీ దీనిని అమలు చేయడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా స్థానికులకు 75శాతం ఉపాధి కల్పించాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నది.

కోరమాండల్, రాంబిల్లి వద్ద ఎన్ఎఓబిలల్లో కూడా నిర్మాణపనులు జరుగుతున్నాయి. ఎన్ఎఓబి కోసం ఈ ప్రాంత ప్రజలు, మత్స్యకారులు త్యాగాలు చేసి వేల ఎకరాల భూములను ఇచ్చారు. నిర్వాసితులయ్యారు. స్థానిక గ్రామాలవారికి ఇక్కడ ఉపాధి కల్పించడం లేదు. యాజమాన్యాలు కూడా కాంట్రాక్టర్లకి వత్తాసు పలుకుతున్నారు. ఉపాధి లేక స్థానిక యువత తీవ్ర ఆవేదనతో వున్నారు.

యాజమాన్యాలతో పాటు ఈ ప్రాంత ప్రజాప్రతినిధుల వైఖరి కూడా స్థానికులకు న్యాయం చేసే విధంగా లేదు. లేని పక్షంలో స్థానిక యువత, ప్రజల యొక్క ప్రతిఘటనను యాజమాన్యాలు, ప్రభుత్వం ఎదుర్కొనక తప్పదని హెచ్చరిస్తున్నాం.

## నేటినుండి డ్వాక్రా వస్తు ప్రదర్శన

శ్రీకాకుళం : జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో డ్వాక్రా వస్తు ప్రదర్శనను ఈ నెల 4 నుండి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఏ.కళ్యాణ చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ నుండి స్థానిక పి.ఎస్.ఎన్.ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో దీనిని నిర్వహిస్తున్నామని, ప్రదర్శనలలో డ్వాక్రా మహిళలు తయారు చేసిన చేనేత పరికరాలు, ఆహార పదార్ధాలు, పచ్చళ్ళు, కర్ర, ఇత్తడి తదితర మెటీరియల్ తో తయారు చేసిన పరికరాలు, అలంకరణ వస్తువులు ఉంటాయని ఆయన చెప్పారు.

# విజయభాను సంపాదకీయం

## తీవ్రరూపం దాల్చుతున్న ఎన్నార్సీ

జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ) వివాదం రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తున్నది. సరిహ ద్దురాష్ట్రాల్లో అనిశ్చితి, అభద్రత ఏర్పడుతున్నది. అస్సాం ఎన్నార్సీ వివాదం అటుండగానే కేంద్ర హోంమంత్రి అమిత్ షా పశ్చిమబెంగాల్ పర్యటనలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా ఉన్నాయి. కోల్‌కతాలో జనజాగరణ్ కార్యక్రమంలో పాల్గొన్న అమిత్‌షా పశ్చిమబెంగాల్‌లో ఎన్నార్సీని తప్పకుండా అమలుచేస్తామని ప్రకటించటమే కాదు, దేశంలోకి అక్రమంగా చొరబడిన వారందరినీ వెళ్లగొడతామని ప్రకటించారు. దేశభద్రత దృష్ట్యా ఎవరేమన్నా ఎన్నార్సీ అన్ని రాష్ట్రాల్లో అమలుచేసి తీరుతామనటం గమనార్హం. అయితే అమిత్‌షా ప్రకటనను విచ్ఛిన్న రాజకీయంగా మమతాబెనర్జీ తీవ్రంగా ఖండించారు. ఈ ఖండన మండనలు అటుంచితే ఈ సందర్భంగా అమిత్ షా వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయి. చొరబాటుదారులను వెళ్లగొట్టే ముందు శరణార్థులైన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులందరికీ భారత పౌరసత్వం కల్పించటానికి పౌరసత్వ (సవరణ) బిల్లును ఆమోదిస్తామని ప్రకటించటం బీజేపీ అనుసరించాలనుకుంటున్న వ్యూహాన్ని చెప్పకనే చెప్పినట్లయింది. పౌర జాబితా రూపకల్పనకు అనుసరిస్తున్న విధానం ఏదైనా ఉంటే, అది కుల మతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు అనువర్తింపచేసేదిగా ఉండాలి. కానీ కొన్ని మత సమూహాలకు మినహాయింపు ఇస్తున్నట్లుగా, నేరుగా కేంద్ర హోంమంత్రి ప్రకటించటం గర్హనీ యం. దీనిద్వారా బీజేపీ కొన్నివర్గాలను లక్ష్యంగా చేసుకుని ప్రవర్తిస్తున్నట్లుగా వ్యవహరించటమే తీవ్ర అభ్యంతరకరం. భారతీయులను, విదేశీయులను వేరుచేసేందుకు చేపట్టిన కార్యక్రమమే ఎన్నార్సీ. మొదట 1950లో కేంద్ర ప్రభుత్వం జాతీయ పౌరసత్వ రిజిస్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్వాతంత్ర్యానంతరం తూర్పు పాకిస్థాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్) నుంచి పెద్దమొత్తంలో ఈశాన్య రాష్ట్రాల్లోకి వలసలు కొనసాగిన దాఖలాలున్నాయి. మిగతా రాష్ట్రాల స్థితి ఎలా ఉన్నా, ఈశాన్య రాష్ట్రమైన అస్సాంలో వలసదారుల సమస్య ముందు కు వచ్చింది. ఎనభైయవ దశకంలో అస్సాంలో వలసలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున విద్యార్థి ఉద్యమం పెల్లుబుకింది. వలసదారులను రాష్ట్రం నుంచి పంపించేయాలనే డిమాండ్‌తో ఆల్ అస్సాం స్టూడెంట్ యూనియన్ నేతృత్వంలో ఆందోళన చేపట్టిన విద్యార్థి నేతలు ఏకంగా అధికారంలోకే వచ్చారు. ఆ నేపథ్యంలోంచే 1951 ఎన్నార్సీ రికార్డులను అప్‌డేట్ చేస్తామని 2005 లో అస్సాం ప్రభుత్వం ప్రకటించింది. దానికి ప్రాతిపదికగా 1951నాటి జాబితాలో పేరు ఉన్నవారిని,1971 మార్చి 24కు ముందు (ఇండో-పాక్ యుద్ధం మొదలవటా నికి ఒక రోజు ముందు) ఓటర్ జాబితాలో నమోదైన వారిని ప్రామాణికంగా తీసుకున్నారు. జాబితాలో పేర్ల నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, వివాదాల నేపథ్యంలో ఎన్నార్సీలో రెండు దఫాలుగా సవరణ తర్వాత తుది జాబితా గత ఆగస్టు నెలలో ముసాయిదాగా ప్రకటించారు. మూడున్నరేండ్ల ఎన్నార్సీ ప్రక్రియలో 41లక్షల మందిని విదేశీయులుగా తేల్చారు. ఈ క్రమంలో 16 రకాల ధృవపత్రాలను కలిగి ఉన్నవారిని పౌరులుగా గుర్తిస్తామన్న అధికారులు, ఓటర్‌లిస్టు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు ఉన్నవారిని కూడా జాబితాలో చేర్చలేదు. అంతేకాదు, ప్రభుత్వ ఉద్యోగులనూ, సైనిక జవానులను విదేశీయుల జాబితాలో చేర్చటంతో అస్సాంలో చేపట్టిన ఎన్నార్సీ ప్రక్రియపై అనేక అనుమాలు రేకెత్తడమే కాదు, అది అభాసుపాలైంది. ఇప్పుడు ఏకంగా దేశవ్యాప్తంగా ఎన్నార్సీ చేపడుతామనటం కూడా అనేక అనుమానాలు వ్యక్తమవడం సహజం. ఏ దేశంలో ఏప్రాంతంలోనైనా దేశీయుల గణన కచ్చితమైన రీతిలో ఉండటం భద్రతరీత్యా అనివార్యం. కానీ అస్సాం అనుభవం భద్రతకు బదులు భయాందోళనలు రేకెత్తిస్తున్నది. అస్సాంలో ఏకంగా 40 లక్షల మందిని విదేశీయులుగా తేల్చి, వారి భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చేశారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సంక్షోభంగా పరిణమించవచ్చన్న భయాలు కలుగుతున్నాయి. ఇంత సంఖ్యలో విదేశీయులు అంటే, ప్రపంచంలోని శరణార్థుల జనాభాలో పదోవంతు. ప్రపంచవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మిగిలిన మయన్మార్ రోహింగ్యాల సంఖ్య పది లక్షలు మాత్రమే. అంటే ప్రపంచంలోనే అతి ఎక్కువ కాందిశీకులున్న ప్రాంతంగా అస్సాం మారిపోయింది. ఆ నలభై లక్షల మందిని ఏం చేస్తారో ప్రభుత్వం చెప్పటం లేదు. ఎన్నార్సీలో పేరులేని వారందర్నీ నిర్బంధగృహాల్లోకి తరలించటానికి కేంద్రం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇదే నిజమైతే పెద్ద విషాదమే. ఇలాంటి సంక్లిష్టతల్లోంచే తీవ్ర మానవ సంక్షోభాలు తలెత్తినట్లు చరిత్ర చెబుతున్నది. ఇన్నాళ్లుగా మతం, మెజారిటీ సామాజిక సున్నితాంశాలు కేంద్రంగా రాజకీయాలు చేసిన బీజేపీ ఇప్పుడు విదేశీయుల పేరిట మరో ఆయుధాన్ని ఓట్ల వేటలో వినియోగించటానికి సమాయత్తమవుతున్నదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

# నేడు వైయస్ఆర్ వాహన మిత్ర


**- జిల్లాలో 10,652 మంది లబ్ధిదారులు - ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం**

**- పాల్గొననున్న రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్**

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వై.యస్.ఆర్ వాహన మిత్ర కార్యక్రమం జిల్లాలో భారీ ఎత్తున చేపడుతున్నట్లు రవాణా శాఖ ఉప కమీషనర్ డా.వడ్డి సుందర్ తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళంలో ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు ఏర్పాట్లను పరిశీలించారు. శుక్ర వారం ఉదయం 10 గంటల నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్, జిల్లా కలెక్టర్ జె నివాస్, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. వాహన మిత్ర పథకం క్రింద సొంత ఆటో, టాక్సీ, మాక్సీ క్యాబ్ లుగల వారికి రూ.10 వేలను ప్రభుత్వ ఆర్థిక సహాయంగా అందిస్తుందని అన్నారు. జిల్లాలో ఈ నెల సెప్టెంబరు 14 నుండి 25వ తేదీ వరకు వాహన యజమానుల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని చెప్పారు.

జిల్లాలో 10,798 మంది సొంత వాహనదారులు నమోదు చేసుకోగా దరఖాస్తుల పరిశీలన అనంతరం 146 అనర్హమైనవిగా గుర్తించగా మిగిలిన 10,652 దరఖాస్తులకు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. సొంత ఆటో కలిగి వాహన మిత్రకు దరఖాస్తు చేసుకున్న జిల్లాగా రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచామని సుందర్ చెప్పారు. ఆమదాలవలస మండలంలో 201, ఆమదాలవలస పట్టణంలో 170, ఎచ్చెర్లలో 573, జి సిగడాంలో 297, గారలో 411, ఎల్.ఎన్.పేటలో 119, లావేరులో 437, పొందూరులో 385, రణస్థలంలో 495, సరుబుజ్జిలిలో 191, శ్రీకాకుళం గ్రామీణ మండలంలో 551, శ్రీకాకుళం పట్టణంలో 613, భామిని మండలంలో 93, బూర్జలో 273, హిర మండలంలో 181, కొత్తూరులో 171, పాలకొండ మండలంలో 120, పాలకొండ పట్టణంలో 36, రాజాం మండలంలో 184, రాజాం పట్టణంలో 103, రేగిడి ఆమదాలవలసలో 231, సంతకవిటిలో 246, సీతంపేటలో 146, వంగరలో 131, వీరఘట్టాంలో 217, మెళియాపుట్టి మండలంలో 219, నందిగాంలో 198, పలాస మండలంలో 205, పలాస కాశీబుగ్గ పట్టణంలో 181, పాతపట్నంలో 226, వజ్రపు కొత్తూరులో 217, జలుమూరులో 263, కోటబొమ్మాళిలో 369, నరసన్నపేటలో 266, పోలాకిలో 299, సంతబొమ్మాళిలో 278, సారవకోటలో 172, టెక్కలిలో 288, ఇచ్ఛాపురం పట్టణంలో 85, ఇచ్ఛాపురం మండలంలో 94, కంచిలిలో 154, కవిటిలో 188, మందసలో 230 మంది వై.యస్.ఆర్ వాహన మిత్ర పథకం క్రింద ప్రయోజనం పొందుతున్నారు.

## తిరుమల శ్రీవారి కంటే జగన్ అతీతుడా?: చంద్రబాబు



గుంటూరు: క్రిస్టియన్ అని చెప్పుకుంటున్న సీఎం జగన్మోహన్ రెడ్డి.. తిరుమల శ్రీవారికి పట్టు వస్త్రాలు ఇచ్చారని, ఆలయశీ అపవిత్రత కాకుండా ఇతర మతస్థులు అక్కడ డిక్లరేషన్ ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అబ్దుల్ కలాం, సోనియాగాంధీలు కూడ అలా డిక్లరేషన్ ఇచ్చారని, జగన్ మాత్రం ఇవ్వలేదని ఆరోపించారు. తిరుమల వేంకటేశ్వరస్వామి కంటే జగన్ అతీతుడా? అని ఆయన ప్రశ్నించారు. ఆనాడు స్వామివారి పింక్ డైమండ్ తన ఇంట్లో ఉందన్నారని, ఇప్పుడు ధర్మారెడ్డి అసలు పింక్ డైమండ్ అనేదే లేదంటున్నారని, పింక్ డైమండ్ ఎక్కడుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. వైసీపీ కార్యకర్తలు టీడీపీపై పెట్టిన ప్రతి పోస్టును డీజీపీకి ఇచ్చామని, అవి డీజీపీకి ఎందుకు కనిపించడంలేదని చంద్రబాబు ప్రశ్నించారు. ఇంత దిగజారుడు రాజకీయాలు తన జీవితంలో ఎప్పుడూ చూడలేదన్నారు. లక్ష రూపాయల ఫర్నీచర్‌పై ఎన్నో పోస్టులు పెట్టి మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆత్మహత్యకు కారణమయ్యారని, మరి రూ.43వేల కోట్లు దోచుకున్న జగన్‌ని ఏం చేయాలని ఆయన ప్రశ్నించారు.

ఒక మాజీ డీజీపీపై అసభ్య పోస్టు పెడితే ప్రస్తుత డీజీపీకి, పోలీసులకు రోషం లేదా? అని చంద్రబాబు నిలదీశారు.

## బీజేపీలోకి మిథున్ చక్రవర్తి!

నాగ్‌పూర్: బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి భారతీయ జనతా పార్టీలో చేరనున్నారా? నాగ్‌పూర్‌లోని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించడంతో మిథున్ బీజేపీలో చేరడం ఖాయమని రాజకీయ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ విగ్రహం ముందు అంజలి ఘటించారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలతో సమావేశమై చర్చలు జరిపారు. అయితే ఆయన బీజేపీలో ఎప్పుడు, ఎక్కడ చేరతారనే విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న మిథున్ గతంలో రాజ్యసభ సభ్యుడిగా కూడా పనిచేశారు. ఆయన బీజేపీలో చేరితో పార్టీకి మరింత ప్రయోజనం చేకూరుతుందని కమలనా థులు అంచనా వేస్తున్నారు.

పశ్చిమబెంగాల్‌లో అతి త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

అధికార తృణమూల్ పార్టీకి భారతీయ జనతా పార్టీ గట్టి పోటీ ఇస్తోంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీజేపీ 18 పార్లమెంట్ స్థానాలు గెలుచుకుని మమత సర్కారు కంటిమీద కునుకు దూరం చేసింది. మిథున్ గతంలో హిందీ, బెంగాలీ, తెలుగు, తమిళం, కన్నడ, పంజాబీ, మరాఠీ, భోజ్‌పురి చిత్రాల్లో నటించారు. 350కి పైగా చిత్రాల్లో నటించిన మిథున్ అనేక అవార్డులను కూడా సొంతం చేసుకున్నారు.

## పీఎస్సార్ ఆంజనేయులుకు ఏపీపీఎస్సీ బాధ్యతలు



అమరావతి: రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ పీఎస్సార్ ఆంజనేయులుకు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) కార్యదర్శిగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటి వరకూ ఏపీపీఎస్సీ కార్యదర్శిగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి అనిల్ కుమార్ మౌర్యను బయో డైవర్సిటీ బోర్డు సభ్య కార్యదర్శిగా బదిలీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి పీవీ చలపతిరావును రిలీవ్ చేయాలని మౌర్యను ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం ఉత్తర్వులు జారీ చేశారు.

## కవి సమయం

### 'ధరిత్రి తల్లి భారతి

ధరిత్రి తల్లి భారతిన - పూసిన పువ్వులు స్త్రీజాతి
కానుపునిచ్చి - తర తరాలకు ప్రేమను పెంచి
భారతి పుడమికి హారతులిచ్చి
హైందవ ధర్మం అన్ని మూలలు
ఇటువంటి భారతదేశం
నిలుపుకో సౌభాగ్యం
పుణ్య ఫలం.
కలిమికి కామాక్షి భారతదేశం
పెట్టిన చేతులు పుణ్యం దేశం
ఎన్నెన్నో యుగాలు చరిత భారతదేశం
తెలుపుచున్నవి గ్రంథస్తం
భద్రపరచు చున్నాము దస్తరం.
మణుమానిక్యాలు అడవి తల్లి బిడ్డలు
పోడుమీద పలు కష్టాలు యేరువాకతో
మురిసిపోతున్నాము
శ్రమజీవులు పుడమి సంపద

... కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

## పంచాంగం

మాసం :ఆశ్వయుజ; తిథి: షష్ఠి ప.2.20; జ్యేష్ఠ సా.5.44; రా.వ.1.52ల 3.29.

**శుక్రవారం 04-10-2019**

**మేషం** : ధనాదాయం బాగున్నా ఊహించని ఖర్చుల వల్ల ఒడిదుడుకులు తప్పవు. మొండి బాకీలు సైతం వసూలు అవుతాయి. ఇంటా బయటా సమస్యలు తలెత్తినా తెలివితో పరిష్కరిస్తారు. రవాణా వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించండి. కపటం లేని మీ ఆలోచనలు, సలహాలు మీకు అభిమానుల్ని సంపాదించి పెడుతుంది. **వృషభం** : విదేశీ యత్నాలలో కొన్ని అవాంతరాలు ఎదురైనా విజయం సాధిస్తారు. వ్యాపారాభివృద్ధికి కొత్త కొత్త ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. విలాస వస్తువులు అమర్చుకోవాలనే స్త్రీల కోరికలు నెరవేరుతాయి. రుణ విముక్తులు కావాలనే మీ ఆలోచన ఫలిస్తుంది. సోదరీ, సోదరులతో కలహాలు తలెత్తుతాయి. **మిథునం** :రవాణా రంగాల వారికి ప్రయాణీకులతో ఇబ్బందులను ఎదుర్కొంటారు. డాక్టర్లు అరుదైన శస్త్రచికిత్సలను సమర్థంగా పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. పెద్దల ఆరోగ్యములో మెళకువ అవసరం. ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. బంధుమిత్రులను కలుసుకుంటారు. **కర్కాటకం** : రాజకీయ నాయకులకు మంచి పేరు, ఖ్యాతి లభిస్తుంది. రవాణా వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించండి. స్త్రీలకు తలపెట్టిన పనిలో ఆటంకాలను ఎదుర్కొంటారు. అనవసరపు సంభాషణ వల్ల సహోద్యోగులతో ఆకస్మిక భేదాభి ప్రాయాలు తలెత్తే ఆస్కారం ఉంది. ప్రముఖుల కలయికతో పనులు పూర్తవుతాయి. **సింహం** : ఇతరులను ధనసహాయం అడగటానికి అభిజాత్యం అడ్డువస్తుంది. వృత్తుల వారికి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుంది. పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. ఉద్యోగస్తులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు. షాపు గుమాస్తాలు, అకౌంట్లకు ఒత్తిడి, పనిభారం అధికం. **కన్య** : బ్యాంకు పనులు మందకొడిగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. కుటుంబీకుల కోసం నూతన పథకాలు రూపొందిస్తారు. పోస్టల్, టెలిగ్రాఫ్, కొరియల్ రంగాలవారికి శ్రమాధిక్యత. జూదాల్లో ధననష్టం, చికాకులు ఎదుర్కొంటారు. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం ఆలోచన విరమించుకోవడం మంచిది. **తుల** : చిన్ననాటి వ్యక్తుల కలయిక సంతోషం కలిగిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల పనివారికి ఒత్తిడి, చికాకులు వంటివి అధికమవుతాయి. గతంలో నిలిపి వేసిన వ్యాపారాలు, పనులు పునః ప్రారంభించేందుకు చేయు యత్నాలు కలిసివస్తాయి. కోర్టు వ్యవహారాలు అనుకూలిస్తాయి. ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. **వృశ్చికం** :ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి ఉంటుంది. కుటుంహంలో చికాకులు తొలగిపోయి మానసిక ప్రశాంతత నెలకొంటుంది. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. రాజకీయ నాయకులకు ఊహించని మార్పులు చోటుచేసుకుంటాయి. **ధనుస్సు** : ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా సాగుతాయి. లౌక్యంగా పనులు చక్కబెట్టుకోవాలి. ఆస్తి, స్థల వివాదాలు కొలిక్కివస్తాయి. పాత మిత్రుల కలయికతో మీలో కొత్త ఉత్సాహం చోటుచేసుకుంటుంది. విద్యార్థులకు తోటివారి కారణంగా చికాకులు తప్పవు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో పోటీతత్వము పెరుగుతుంది. **మకరం** : ఆదాయ వ్యయాలకు ఏమాత్రం పొంతన ఉండదు. మీ మాటే నెగ్గాలనే పట్టుదల మంచిది కాదు. స్త్రీలకు ఆరోగ్యంలో చిన్న చిన్న చికాకులు తలతెత్తగలవు. జాగ్రత్తలు అవసరం. బ్యాంకు వ్యవహారాల్లో ఇబ్బందులు తలెత్తుతాయి. ప్రైవేట్ సంస్థల్లోని వారు తోటి వారితో స్నేహ భావంతో సంచరిస్తారు. **కుంభం** :మీ శ్రీమతి వైఖరిలో మార్పు సంతోషం కలిగిస్తుంది. ఆత్మీయుల రాకతో గృహం కళకళలాడుతుంది. ప్రయాణాల్లో ఊహించని చికాకులను ఎదురవుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం క్షేమదాయకం. కొబ్బరి పండ్ల పూల వ్యాపారులకు కలిసిరాగలదు. **మీనం** : ప్రియతములతో విరామ కాలక్షేపాలతో పాల్గొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. మీ శ్రీమతి సలహా పాటించడం చిన్నతనంగా భావించకండి. రావలసినధనం అనుకోకుండా చేతి కందుతుంది. విద్యార్థులు అనవసర భయాందోళనలు విడనాడి శ్రమించినట్లైతే జయం పొందగలరు.

# మహిమాన్వితం... శివగంగ ఆలయం



పద్మాకారంలో ఆలయం. కింద గం గమ్మ.. మధ్యన రాజరాజేశ్వరి మాత..ఆ పైన త్రినేత్రుడు కొలువుదీరిన మహాద్భుతమైన చోటు. చుట్టూ పద్మరేకుల్లా చిన్నచిన్న శివాలయాలు.., రావి, వేప, మేడి చెట్లు అల్లుకొని త్రివృక్షమై బాసిల్లుతున్న ప్రాంతం..అదే మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయం. కాకతీయుల కాలంలో నిర్మాణమైన ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ.. భక్తుల కొంగుబంగారమై అలలారుతోంది. కాకతీయుల కాలంలో రాజరాజేశ్వరస్వామి ఆలయం నెలకొల్పడంతో ఈ గ్రామానికి మహేశ్వరం అని పేరు వచ్చింది. శివగంగలో కొలువుదీరిన ఈ ఆలయం సందర్శకులను ఇట్టె కట్టిపడే స్తుంది. ఈ ఆలయ నిర్మాణం పద్మాకారంలో ఉంటుంది. దీనిచుట్టూ శ్రీహరిహరేశ్వరుడు, శ్రీమల్లీశ్వరుడు, శ్రీఅవిముక్తేశ్వరుడు, శ్రీఅఘోరేశ్వరుడు, శ్రీఅమరేశ్వరుడు, శ్రీఅమృతేశ్వరుడు, శ్రీగంగాధేశ్వరుడు, శ్రీఇష్ట కామేశ్వరుడు, శ్రీముకే శ్వరుడు, శ్రీకాళహస్తీశ్వరుడు, శ్రీఏకాంబేశ్వరుడు, శ్రీమణి కర్ణికేశ్వరుడు, శ్రీమహా నందీశ్వరుడు, శ్రీఅమరావ తీశ్వరుడు, శ్రీకాశీ పతీశ్వరుడు, శ్రీమంగళగౌరీశ్వరుడు ఆలయాలు పదరేకుల్లా ఉంటాయి.

ఆలయంలోని అష్టాదశంగా (18 సంఖ్య వచ్చేలా) నిర్మిం చడం విశేషం. సహజంగా శివుడి తలపై గంగ ఉంటుంది. ఇక్కడ మాత్రం గంగలోనే శివుడు ఉండడంతో ఆయన కింది భాగంలోనే రాజేశ్వరీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ శివగంగలో స్నానమాచరిస్తే వారి దోషాలు పోతాయని భక్తుల నమ్మకం.

సంకీర్తన

### చరిత్రకు నిలువుటద్దం గడికోట

కాకతీయుల కాలం నాటి చరిత్రకు నిలువుటద్దంగా ఆలయం పక్కనే గడికోట నిర్మాణం నేటికీ నిలిచి ఉంది. కొంత శిథిలావస్థకు చేరినప్పటికీ కోటలోని కట్టడాలు నేటికి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. గడికోట చుట్టూ ఆర్చిలతో పాటు మధ్యలో ఉన్న కొలను ను అద్భుతంగా నిర్మించారు.

### మహత్యం..త్రివృక్షం....:

ఆలయం ముందున్న చెట్టుకు ఓ చరిత్ర ఉంది. రావి, వేప, మేడి చెట్లు ఒకేచోట పెరగడంతో దీన్ని తివృక్ష చెట్టుగా పిలుస్తారు. పిల్లలు కానివారు ఈ చెట్లకు కొత్త కొబ్బరికాయ కట్టితే పిల్లలు పుడుతారని నమ్మకం. ఈవృక్షం కిందనే నాగేంద్రాలయం ఉంది.

### ఆలయ చరిత్ర...

తానీషా నవాబుల వద్ద పని చేసిన అక్కన్న మాదన్నలు 1672లో వారి పర్యటనలో భాగంగా శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి రాజధాని గోల్కొండ కోటకు పశ్చిమ భాగాన 37 కిలో మీటర్ల దూరంలో ఈ దేవాలయం ఉంది. శంషాబాద్ మండలంలోని చిన గోల్కొండ, పెద్ద గోల్కొండ గ్రామాల మీదుగా అక్కన్న ,మాదన్నలు ఇక్కడికి చేరుకునేవారట.

మహేశ్వరం ఆలయంతో పాటు సమీపంలోనే కోదండరామస్వామి ఆలయం, శివగంగ పుష్కరిణి, విష్ణు భగవాన్, ఆంజనేయస్వామి ఆలయాలను సైతం అక్కన్న మాదన్నలు నిర్మించినట్లు ప్రతీతి . ఎనిమిదేళ్ల కాలంలో వీటి నిర్మాణం పూర్తయినట్లు చరిత్ర చెబుతోంది.

1677లో ఈ ఆలయం పునర్‌నిర్మాణంలో ఉన్నప్పుడు శ్రీశైలం దర్శనానికి వెళ్లిన శివాజీ కూడా రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని వెళ్లినట్లు చరిత్ర చెబుతుంది. 1687లో ఔరంగజేబు దాడిలో గుడిని ధ్వంసమైనట్లు చెబుతుంటారు.



శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004



20వవార్డు జిల్లా పరిషత్ జంక్షన్ ఆటోస్టాండ్ వారి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన దేవీ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆటోస్టాండ్ సంఘ సభ్యుల ఆహ్వానం మేరకు దుర్గాదేవిని దర్శించుకున్న రాష్ట్ర కార్యదర్శి యువజన విభాగం మరియు 20వవార్డు ఎక్స్ ప్రెసిడెంట్ మన్యాల శ్రీనివాస్, 20వవార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మారిడిమాంబ విగ్రహా నిర్మాణానికి అంకురార్పణ



దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో నిర్మాణంలో ఉన్న మారిడిమాంబ అమ్మవారి ఆలయంలో గురువారం అమ్మవారి విగ్రహా నిర్మాణానికి అంకురార్పణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముందు దుర్గ భవానీ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దలు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కర్ రావు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఇది వరకే ఆలయ నిర్మాణం పూర్తి కాగా విగ్రహం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. త్వరలో అమ్మవారి ఆలయం పనులు పూర్తి చేస్తామని భాస్కర్ తెలిపారు. ఆలయం అభివృద్ధి కి విరాళాలు ఇచ్చి సహాయ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో వరదపు రెడ్డి సింహాచలం నాయుడు, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, కేవీ. రమణ, వేచలపు అప్పలనాయుడు, సోమిరెడ్డి పేరు నాయుడు, వెత్సా రమేష్, గాలి సత్యనారాయణ, రాజేష్, పరవాడ రవి తదితరులు పాల్గొన్నారు.

'సంత్ నిరంకారీ' ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

## స్వచ్ఛ భారత్ కార్యక్రమం



విశాఖపట్నం : రైల్వేస్టేషన్‌లో మహాత్మాగాంధీ 150వ జన్మదినంను పురస్కరించుకుని బుధవారం 'సంత్ నిరంకారీ' ఛారిటబుల్ ఫౌండేషన్ విశాఖపట్నం వారు వివిధ నినాదాలను బ్యానర్స్‌తో సహా స్వచ్ఛ భారత్- స్వచ్ఛ రైల్, శుభ్రత వైపు ఒక అడుగు ముందుకు, ప్లాస్టిక్ వాడకండి - దేశాన్ని రక్షించండి, మన నినాదం ఒకటే- స్వచ్ఛమైన భారత్ మనది అను నినాదాలతో విశాఖ రైల్వే స్టేషన్‌లోనూ, అనకాపల్లి రైల్వేస్టేషన్‌లోనూ మరియు పరవాడలోని ఎన్‌టిపిసిలోనూ వివిధ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఇవన్నీ కూడా ఢిల్లీలోని సంత్ నిరంకారీ మండల్ ఆదేశాల మేరకు నిర్వహించబడినవి. సుమారు 200మందికి పైగా నిరంకారీ మిషన్ వాలంటర్స్ దీనిలో పాల్గొన్నారు. విశాఖపట్నం సంత్ నిరంకారీ మండల్ సంయోజకులు ప్రేమ్‌మార్‌పురీ, పి.వి.రావ్, రవి, సత్యనారాయణరాజు, రాజ్‌వీర్, గద్దిపల్లి రాముతో పాటు పలు రైల్వే అధికారులు కూడా పాల్గొన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీవో ప్రకారం జీతాలు చెల్లించాలి

**సిఐటియు డిమాండ్**

విశాఖపట్నం: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీవో ప్రకారం జీతాలు చెల్లించాలని ఏపీఎస్ ఆర్టీసీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) విశాఖజిల్లా కన్వీనర్ వి.తులసీరాం డిమాండ్ చేశారు. ఆర్టీసీలో పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కనీసం ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు, సెలవులు, ఇఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు, బస్‌పాస్‌లు సైతం కాంట్రాక్టర్ అమలు చేయడం లేదన్నారు. సేఫ్టీ పరికరాలు, మెటీరియల్స్ ఇవ్వడం లేదు. జీవోలో పేర్కొన్న వేతనాలు కంటే కాంట్రాక్టర్ 1200 రూ॥ల నుండి రూ.2000 ల వరకు తగ్గించి జీతాలు చెల్లించడం దుర్మార్గమన్నారు. ఇచ్చే తక్కువ వేతనాలు కూడా రెండు, మూడు నెలలు బకాయిలు పెడుతున్నా ఆర్టీసీ యాజమాన్యం నిలదీయడం లేదన్నారు. ఇవన్నీ అడిగితే కార్మికులపై కాంట్రాక్టర్ బెదిరింపులకు దిగుతున్నారు. ఆర్టీసీ లాభాల కోసం అవుట్ సోర్సింగ్ కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నా యాజమాన్యం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. తక్షణమే కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా ఆర్టీసీ యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని సిఐటియు కోరుతున్నది.

## తిరుపతి శ్రీవారి ఉత్సవంలో చోడవరం కోళాటబృందం



చోడవరం : తిరుపతి జరుగుతున్న వెంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవంలో చోడవరం గణపతి గోవింద అన్నమయ్య కోళాట బృందం సభ్యులు గురువారం పాల్గొని స్వామివారి మాఢ వీధు లలో కోలాటం ప్రదర్శించారు. ప్రతి ఏడాది స్వామి వారి బ్రహ్మోత్సవాలలో చోడవరం కళాకారులు కోలాటం ప్రదర్శించడం ఆనవా యతీగా వస్తుంది. ఈ ఏడాది సుమారు 20 మంది అన్నమయ కోళాట బృందం సభ్యులు పాల్గొని కోళాటం ప్రదర్శిం చారు. తిరుమల శ్రీ వారి ఉత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని బృంద సభ్యులు తెలిపారు.

## విశాఖ ఏజెన్సీలో సీపీఐ మావోయిస్ట్ పార్టీ బంద్‌కు పిలుపు



కొయ్యూరు : విశాఖ ఏజెన్సీ లో సీపీఐ మావోయిస్ట్ పార్టీ బంద్‌కు పిలుపు నివ్వటంతో కొయ్యూరు పోలీసులు ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు లేకుండా, కొయ్యూరు ఎస్ఐ రెడ్డి అసిరి తాత తన సిబ్బంది తో వచ్చే పోయే వాహనాలను తనిఖీలు చేస్తూ , వారి వివరాలను తెలుసుకుని అనుమానితులను ప్రశ్నించి విడిచి పెట్టారు అయితే బంద్ వాతావరణం మండల కేంద్రంలో కనబడలేదు మండలంలో వ్యాపారస్తులు, ప్రైవేటు వాహనాలు ఆర్టీసి బస్సులు యధావిధిగా తిరిగాయి.

## డెంగ్యూ పై విద్యార్థుల ర్యాలీ



రావులపాలెం : రావులపాలెం సంహిత విద్యా సంస్థల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జూనియర్, డిగ్రి కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు డెంగ్యూ వ్యాధి ప్రభలకుండా తీసుకోవలసిన చర్యలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గురువారం అంకంపాలెం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు ప్రతి ఇంటికి వెళ్ళి డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని వివరిస్తూ డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి గ్రామస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దినేష్‌బాబు, డీన్ శ్రీనివాసు, ప్రిన్సిపాల్ రామ నరేష్, నాగబాబు, సమితి కోఆర్డినేటర్ సూర్యనారాయణ, వెంకట కుమార్, గణేష్‌కుమార్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



పెద్దాపురం : పెద్దాపురం డివిజన్లోని శంఖవరం, పెద్దాపురం, తుని అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు,హెల్పర్లకు సంబంధించిన పోస్టుల భర్తీకి 88 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు రెవిన్యూ డివిజనల్ అధికారి ఎస్.మల్లి బాబు తెలిపారు. గురువారం ఆర్డీఓ కార్యా లయంలో పెద్దాపురం, శంఖవరం, తుని అర్బన్‌కు చెందిన 32 పోస్టులకు ఆర్డీవో సమక్షంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ సందర్భంగా ఆర్డిఓ విలేకరులతో మాట్లాడుతూ ఈరోజు శంఖవరం, పెద్దాపురం, తుని అర్బన్‌కు సంబంధించిన ఐసిడిఎస్ ప్రాజెక్టు పోస్టులకు ఇంట ర్వ్యూలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.వీటిలో పెద్దాపురం ప్రాజెక్టు పరిధిలో 17 పోస్టులకు గాను 80 దరఖాస్తులు రాగా 12 మంది హాజరయ్యారని, శంఖవరంకి సంబంధించిన 10 పోస్టులకు 8 దరఖాస్తులు రాగా ఎనిమిది మంది, అలాగే తుని అర్బన్ పరిధిలో 5 పోస్టులకు 8 దరఖాస్తులకు 8 మంది హాజరయ్యారని తెలిపారు. రేపు కూడా డివిజన్లోని మిగిలిన ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోగల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు.

ఇంటర్వ్యూలు పూర్తి చేసిన తర్వాత ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాన్ని అందజేయడం జరుగుతుందని ఆర్డిఓ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పెద్దాపురం, శంఖవరం,తుని అర్బన్ సిడిపివోలు పి. సావిత్రమ్మ, ఊర్మిళ, కె.నాగలక్ష్మి, ప్రభుత్వ వైద్య అధికారిని డాక్టర్ సుదీప్తి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే పీలా



అనకాపల్లి : . అనకాపల్లి మాజీ శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ శతకంపట్టు కనక దుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద అన్నప్రసాదాన్ని ప్రారంభించారు. దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జరుగు తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 9 రోజులు పాటు రోజుకు 1500 మందికి అన్నసమారాధన నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పీలా గోవింద సత్యనారాయణ అవసరమైన నిధులను సమకూర్చారు. ఉత్సవాలలో భాగంగా గురువారం ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని అన్నదానాన్ని ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో మళ్ల సురేంద్ర, కొణతాల శ్రీనివాస రావు, పచ్చికూర రాము తదితరులు పాల్గొన్నారు.



శ్రీ మహా కామేశ్వరీ పీఠంలో కైలాసగౌరి వ్రతం, మహా కామేశ్వరీ అమ్మవారు కాళీమాతగా దర్శన మిస్తున్నారు. శ్రీ మహా కామేశ్వరి పీఠంలో గోపూజ అత్యంత వైభవంగా జరిగింది. శ్రీ పీఠానికి రుద్రాభిషేకం, క్షీరాభిషేకం అమ్మ వారికి పీతాంబరాలు సమర్పిం చెదరు. ముత్తయిదువులకు పసుపు, కుంకుమ పంచేరు. పీఠంలో చండీయాగం జరిగింది. సీరోసాసన సీరమపత్యాలతో సూర్య నమస్కారములు, సాయంత్రం నవాన రణార్చన యుద్ధనపూడి అయ్యన్నపంతులు స్వీయ పర్యవేక్షణలో జరిగింది. ఈనెల 6వతేదీన సునాసిని అర్చన ఉన్నట్లు తెలిపారు. ముత్తయి దువులు అందరూ పాల్గొనవలసిందిగా యుద్ధనపూడి అయ్యన్న పంతులు కోరారు.

## నిలిచి ఉన్న నీరు తొలగించండి

- ఇలా ఉంటె రోగాలు రావా ...
- పూడిమడకలో డ్రైనేజీ రూపకల్పన ఎప్పుడు ?



అచ్యుతాపురం : గ్రామాలలో రోజు రోజుకు పారిశుధ్యం అధ్వానంగా మారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మత్స్యకార గ్రామమైన పూడి మడకలో రోడ్లు, డ్రైనేజీలు సరిగ్గా లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే ఎక్కడ పడితే అక్కడ నీరు నిలిచి మురికి గుంటల మారి దుర్వాసనతో పాటు దోమలకు నిలయాలుగ మారుతున్నాయి. పూడి మడకలో ప్రధాన రహదారి, ముఖ్య కూడలి అయిన పాత బస్టాండ్ వద్ద వాహనాల రాకపోకలు ,జన సంచా రంతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో మురికినీరు దుర్వాసనతో ప్రజలు, వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చాలా రోజుల నుండి ఇలా కనిపిస్తున్న అధికారులు ఎందుకు పట్టించు కోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిలిచి ఉన్న నీరును తొలగించాలని పూడిమడక ప్రజలు కోరుతున్నారు.

## కొత్త మద్యం పాలసీ ప్రకటించిన ప్రభుత్వం



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని ప్రకటించింది. నూతన మద్యం విధానానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ విడుదల చేశారు. నవంబర్ 1 నుంచి 2021 అక్టోబర్ వరకు కొత్త మద్యం విధానం అమలులో ఉంటుంది. జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజులు ఖరారు చేయనుంది. గతంలో ఉన్న 4 స్లాబులను 6 స్లాబులకు పెంచింది. లాటరీ విధానం ద్వారా మద్యం షాపుల ఎంపిక ఉంటుంది. ధరఖాస్తు ఫీజును రూ.లక్ష నుంచి రూ.2లక్షలకు పెంచారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, ఇతర ప్రాంతాలలో రాత్రి 10 గంటల వరకు మద్యం షాపులు తెరచి ఉంటాయి. ఈ నెలాఖరులోగా లాటరీ విధానం ద్వారా మద్యం లైసెన్స్ దారుల ఎంపిక ఉంటుందని సోమేష్ కుమార్ పేర్కొన్నారు.



స్థానిక నూకాంబిక అమ్మవారికి 153 గ్రాముల బంగారు చెవి దిద్దులు అందజేశారు. బెంగుళూరు పట్టణా నికి చెందిన శ్రీనివాస వెంకటబాబూ భార్య సరితాదేవి దేవి శరన్నవరాత్రి ఉత్స వాలలో భాగంగా అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం ఈ చెవి దిద్దులను ఆలయ కార్య నిర్వాహణాధి కారికి అందజేశారు. ఈ సందర్భంగా విరాళ దాతలు వెంకట బాబు భార్య సరితాకు ప్రసాదం, అమ్మవారి ఫోటోను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఢిల్లీలో నలుగురు జైషే ఉగ్రవాదులు.. పోలీసుల హై అలర్ట్

ఢిల్లీ : దేశ రాజధాని నగరమైన ఢిల్లీలో పాక్ ప్రేరేపిత జైషే మహ్మద్‌కు చెందిన నలుగురు ఉగ్రవాదులు వరుస దాడులకు పాల్పడే అవకాశముందని కేంద్ర నిఘావర్గాలు అందించిన సమాచారంతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇంటలిజెన్స్ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీ నగరంలోని పలు ప్రాంతాల్లో సాయుధ పోలీసు బలగాలను మోహరించారు. ఢిల్లీ నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో సాయుధ పోలీసులు అనుమానమున్నవారిని ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. దేశంలో ఆత్మాహుతి దాడులు చేసేందుకు పాకిస్థాన్ దేశం నుంచి మన దేశంలోకి జైషే మహ్మద్ ఉగ్రవాదులు దళాలుగా ఏర్పడి వేర్వేరు ప్రాంతాలకు వచ్చారని కేంద్ర నిఘా విభాగానికి సమాచారం అందింది. ఇందులో భాగంగానే ఢిల్లీకి నలుగురు ఉగ్రవాదులు వచ్చారని, వారు ఏ క్షణమైనా దాడులు చేయవచ్చని నిఘావర్గాలు చెపుతున్నాయి.

జారీ అయిన హెచ్చరికలతో జమ్మూకశ్మీర్, అవంతిపూర్, పటాన్ కోట్, హిండన్ వైమానిక స్థావరాలతోపాటు దేశ రాజధాని నగరంలో కేంద్ర పారామిలటరీ బలగాల జవాన్లు, ఢిల్లీ పోలీసులు అలర్ట్ ప్రకటించారు.

# ఘనంగా కిలపర్తి జన్మదిన వేడుకలు

- పేద మహిళలకు చీరలు పంపిణీ



దేవరాపల్లి : వైఎస్ఆర్‌సిపి నాయకులు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్, రాష్ట్ర గిరిజన విభాగం వేల్ఫేర్ అధ్యక్షులు రెవ. బిషప్ జి. టైటాస్, గ్రేస్ ఆధ్వర్యంలో మండల కేంద్రం దేవరా పల్లిలో కిలపర్తి స్వగృహం వద్ద జరిగిన ఈ వేడుకలో భాస్కరరావు కేకు కట్ చేసి అభిమానులకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా టైటాస్ సమకూర్చిన చీరలను నిరుపేద మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం క్రీస్తు మతపెద్దలు భాస్కర్‌ను ఆశీర్వదిస్తు ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వి. సింహా చలం నాయుడు. జి.అప్పల రాజు, కేవీ.రమణ, జి. రాంబాబు, అప్పలనాయుడు, బండారు దేముడు నాయుడు, అల్లు సత్యం మూర్తి, జైన్ పాస్టర్ శ్యాం, కె. అప్పారావు, పి. అచ్చిబాబు, కె. సన్ని బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది డిసెంబరు నాటికి

# బ్యాంకు రుణాలు శతశాతం పూర్తి చేయాలి

**చోడవరంలో వెలుగు కో ఆర్డినేటర్ల సమావేశంలో -వెలుగు, పి.డి.విశ్వేశ్వరరావు**

చోడవరం : ఈ ఏడాది డిశెంబరు నాటికి శతశాతం బ్యాంకు రుణాలుపూర్తి చేయాలని వెలుగు(డి.ఆర్.డి.ఎ) ప్రొజెక్టు డైరెక్టర్ విశ్వేశ్వర్ అన్నారు. చోడవరం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో వెలుగు ఏ.పి.ఎంలు, కమ్యూనిటీ కోఆర్డి నేటర్లుతో గురువారం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లోని సమాఖ్య సంఘాలు, గ్రామ సంఘాలు అన్ని (ఎ)గ్రేడుకు తీసుకు రావాలని, రికవరీలు వంద శాతం ఉండేలా చూడాలని, సిబ్బంది పూర్తి స్థాయిలో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీ నిధి ఏ.జి.ఎం, కృష్ణంనాయుడు, ఏరియా కార్డినేటర్ శ్రీనివాస్,చోడవరం ఏపిఎం. ఆదినారాయణ, 5 మండలాలకు చెందిన వెలుగు ఎ.పి.ఎంలు,సి.సి,లు,తదితరులు పాల్గొన్నారు.



**చోడవరంలో నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు పి.డి.విశ్వేశ్వరరావు**

# ఆదిత్య ప్రొ.డా.రమాశ్రీకి జాతీయ ఉత్తమ ఆచార్య పురస్కారం



గండేపల్లి : సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.ఎస్.రమాశ్రీకి జాతీయ స్థాయి ఉత్తమ ఆచార్య పురస్కారం లభించినట్లు ఆదిత్య క్యాంపస్ డైరెక్టర్ ప్రిన్సిపాల్ డా.ఎమ్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గాంధీజీ 150వ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని విజయవాడ వి.ఆర్.సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఇండియన్ సర్వర్స్ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ ఐ.టి.అసోసియేషన్,లైన్స్ క్లబ్, తక్షశిల ఐ.ఏ.ఎస్ అకామి,ఇంపాక్ట్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విశ్రాంత ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హెచ్.ఆర్ డైరెక్టర్ ఎక్స్ అఫిషియో సెక్రటరీ డా. డి. చక్రపాణి చేతులు మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. వివిధ విభాగాలలో ఉత్తమ సేవలందిస్తున్న ప్రొఫెసర్స్ ను ప్రోత్సహించేందుకు నవభారత్ నిర్మాణ్ అవార్డు సెర్మనీ ఆధ్వర్యంలో నిష్ణాతు లైన ఆచార్యులను ఎంపిక చేసి ఈ పురస్కారాలను అందిస్తున్నారని ఆ సందర్భంలో తమ సంస్థలో వైస్ ప్రిన్సిపాల్ గా సేవలందిస్తున్న డా. ఎస్. రమాశ్రీకి అవార్డు రావడం ఆనందదాయకం అని డా. శ్రీనివాసరెడ్డి అన్నారు. అవార్డు గ్రహీత ను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా.ఎన్.శేషారెడ్డి, వైస్ చైర్మన్. సతీష్ రెడ్డి ప్రిన్సిపాల్స్.టి.కె.రామక ృష్ణారావు,ఆదిరెడ్డి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డా.వి.శ్రీనివాసరావు, వివిధ విభాగాధి పతులు ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# అనకాపల్లిలో ఇసుక రిచ్ ఏర్పాటు చేయాలని సిపిఐ డిమాండ్



అనకాపల్లి : గ్రామీణ జిల్లా ప్రదాన కేంద్రమైన అనకాపల్లిలో ప్రభుత్వం ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. గురువారం సిపిఐ నాయకులు ఆర్డీవోను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కొత్త ప్రభుత్వం కొలువు తీరి నాలుగు నెలలు గడిచిన ఇసుక పాలసీలో స్పష్టత లేకపోవడం వలన లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు, భవన నిర్మాణ యజ మానులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. పస్తులతో కార్మికులు జీవితం వెల్లబుచ్చ వలసిన పరిస్తితి ప్రభుత్వం కల్పిస్తుం దన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక లభ్దిత తక్కువగా ఉందని అవసరం ఎక్కువ ఉండడంతో సమస్య ఇబ్బందిగా మారిం దన్నారు. ఈ ఇసుక సమస్య పరిష్కరించ డంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దన్నారు. ఇసుకరీచ్‌లు అనకాపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ఇసుక రీచ్‌లు ఈప్రాంతంలో ఏర్పాటు చేసి స్దానిక ప్రజల అవసరాలు తీర్చాలని కోరారు. ఈ కార్య క్రమంలో సిపిఐ నాయకులు వైఎస్ భద్రం, కోన లక్ష్మణ, కరణం మాణిక్యాలు అప్పారావు, నాగరాజు, కోరిబిల్లి శంకరరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# ఈతకు వెళ్లి బాలుడు మృతి



కొయ్యూరు : మండలంలో వైఎన్ పాకలు గ్రామానికి చెందిన మాదాల దుర్గ ప్రసాద్ మధ్యాహ్న 12 గంటలకు అటకు వెళ్ళిన కొడుకు ఇంకా ఇళ్లకు రాకపోవటంతో అంతా వెతకగా కొప్పుకొండ బ్రిడ్జి వద్ద కాలువలో ఈతకు దిగి, ప్రమాదవశాత్తు గుమ్మీలోకి వెళ్ళటంతో ఊపిరి ఆడక, గుమ్మిలో మునిగి పోయాడని, తోటి స్నేహితులు చెప్పటంతో వెతకగా, కాలవలో చూడగా మృతి చేదినట్టుగా గుర్తించారు. కొడుకు చనిపోవటంతో తల్లీ తల్లడిల్లి పోయింది. స్థాని కులు కేడీపేట ఆసుపత్రికి తీసుకు వెళ్ళగ్గా చనిపోయిన ట్లు వైద్యులు తెలిపారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఆసుపత్రి కి తరలించారు.



# గాయత్రీదేవీ అలంకరణలో రత్నగిరి దేవతలు

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్య నారా యణ స్వామివారి సన్నిధిలో క్షేత్ర రక్షకు లుగా ఉన్న శ్రీ వనదుర్గ,కనకదుర్గమ్మ అమ్మ వార్ల దసరా మహోత్సవాలలో భాగంగా ఐదవ రోజు గురువారం గాయత్రీ దేవి అలంకారములో భక్తులకు దర్శనము ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

# భీమిలీ నియోజకవర్గంలో టీడీపీకి షాక్



భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగిలింది భీమిలి, ఆనందపురం మరియు పద్మనాభం మండలాల్లో తెలుగుదేశం నాయకులు భారీ స్థాయిలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వీరందరూ వైసీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీ తీర్థం పుచ్చుకున్న వారిలో కొందరు ప్రముఖుల లో డి ఎల్ డి చైర్మన్ మాజీ భీమిలీ ఎంపిపి గాడు వెంకటప్పడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన మణి శంకర్ నాయుడు, ఆనందపురం మండల టి.డి.పి అధ్యక్షులు బి.అర్.బి. నాయుడు, ఆనందపురం మాజీ మండల టి.డి.పి అద్యక్షు లు కాకర వెంకట రమణ, భీమిలి మండల టి.డి.పి ప్రధాన కార్యదర్శి గుడ్డాల ఎల్లయ్య,మండల తెలుగు యువత అద్యక్షులు గాడు తాతి నాయుడు, జిల్లా టి.డి.పి పార్టీ మహిళ ఆర్గ నై జిం గ్ సెక్రటరీ, వి.సరోజని, జిల్లా సెక్రటరీ, టీడీపీ మహిళ విభాగం పద్మావతి, సీనియర్ టి.డి.పి నాయకులు, గాడు వెంకట నారాయణ, కృష్ణరాజు పేట, మజ్జివలస మాజీ పి.ఎ.సి చైర్మన్ లచ్చు బుగత రామారావులతో పాటు వీరి అనుచరులు 2000 మంది వైసీపీ లోకి వలస వచ్చారు. మంత్రి ముత్తంశెట్టి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పరిపాలన నచ్చి వీరంతా పార్టీ లోకి వచ్చారన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరువుతుందని, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా గ్రామ సచివాలయ వ్యవస్థని దేశంలో నే మొదటిసారిగా అమలు లోకి తీసుకొచ్చిన వై ఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన చూసి ప్రజలు సంతోషిస్తున్నారని ఆయన చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరు కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి ఉద్బోధించారు.బంటుబిల్లి మణిశంకర్ నాయుడు మాట్లాడుతూ మా వల్ల వైసీపీ కి గాని మంత్రి అవంతి శ్రీనివాసరావుకు ఎటువంటి మచ్చ రాని వ్వమని తెలిపారు. గాడు వెంకటప్పడు మాట్లాడుతూ అవంతి శ్రీనివాస రావు మీద నమ్మకంతో ఆయన నాయకత్వంలో ముందుకెళ్లాలనే ఉద్దేశ్యంతో గ్రామాల్లో పార్టీ లకు అతీతంగా అందరూ కలసి ఉండాలనే ఉద్దేశ్యంతో అయిదు పంచాయితీలలో ఉన్న మొత్తం తెలుగుదేశం క్యాడర్ తో ఈ రోజు వైసీపీలో చేరామని ఇది ఒక చరిత్ర అని అన్నారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల వైసీపీ నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పేద ప్రజల ఆరోగ్య పరి రక్షణే రిఫరల్ ధ్యేయం

రిఫరల్ నందు నూతన ఎల్ఎసి విభాగం ప్రారంభం



కాకినాడ/శంఖవరం : మారు మూల ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా వైద్య సేవలతో పాటు కుష్టు, క్షయ,ఎయిడ్స్ వ్యాధులను నియంత్రించేందుకు గత 15 సంవత్సరాల నుండి తమ వంతు బాధ్యతగా రిఫరల్ సంస్థ కృషి చేస్తుందని రిఫరల్ సేవలు మరువలేనివని అదనపు జిల్లా వైద్యాధికారి డా రోనంకి కిషోర్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి శివారు సీతయమ్మపేట గ్రామంలో గల రిఫరల్ ఆసుపత్రి ప్రాంగణం నందు నూతనంగా ఏర్పాటు చేసిన లింక్ ఆర్ట్ సెంటర్‌ను గురువారం ఉదయం అదనపు జిల్లా వైద్యాధికారి డా.రోనంకి కిషోర్ చేతులు మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల ప్రజలు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని విద్య వైద్య సదుపాయాలు కల్పనే ధ్యేయంగా రిఫరల్ సంస్థ పని చేస్తుందని దీనిలో భాగంగానే రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలు ప్రకారం ఆర్ట్ సెంటర్ జీజీహెచ్ కాకినాడ ప్రధాన ఆసుపత్రిగా రిఫరల్ నందు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఉచితం గా మందులు పంపిణీ చేసేందుకు లింక్ ఆర్ట్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈకేంద్రం ద్వారా రిఫరల్ ఆసుపత్రి పరిధిలో గల 4మండలాలు అయినటువంటి శంఖవరం, తొండంగి, గొల్లప్రోలు, కోటనందూరు మండలాల ఎయిడ్స్ వ్యాది గ్రస్తులు ఉచిత సేవలు పొందవచ్చు అని అన్నారు. వైద్యులు నరేష్,పార్ధేష్,ఆదిమూలం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు మందులు కోసం జిల్లా కేంద్రం అయిన కాకినాడ రాకూండా ఆ సేవలు రిఫరల్‌లో పొందడం ద్వారా సమయం, వ్యయ ప్రయాణం ఆదా చేసుకోవచ్చు అని సంతృప్తి కరమైన సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని చెప్పారు. రిఫరల్ సంస్థ చైర్మన్ ఎన్.స్లెస్సర్ బాబు మాట్లాడుతూ దూర ప్రాంత ప్రజలు పేద ప్రజలు ఆర్థిక పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని వారికి దగ్గరలోనే మందులు సరఫరా వైద్య సలహాలు అందించేందుకు మందులు సరఫరా కేంద్రం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉచితంగా రిఫరల్ ఆసుపత్రిలో ఒక యూనిట్ కేటాయించడానికి 5నెలలు ప్రయిత్నించి హెచ్ఐవితో బాధపడే వారికి పూర్తి సహయ సహకారాలు అందించాలనే సంకల్పంతో ఈ కేంద్రం ఏర్పాటు చేసామని తెలిపారు. అంతేకాకుండా వారికి వైద్యం అందించేందుకు సర్జరీ విభాగం కూడా కలదని జిల్లా మాత్రమే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా ఎవరు లచ్చిన సరే తక్కువ ఖర్చుతో ఆపరేషన్లు కూడా చేయ గలమని ఈ అవకాశాన్ని పేద ప్రజలందరూ వినియోగించుకోవాలని తెలిపారు.



# సత్యసాయి సేవలు ఎనలేనివి

రావులపాలెం : సత్యసాయి ప్రేమామృత మూర్తి అని, అందరిపై ప్రేమ అభిమానాలు కనబర్చేవారని, సత్యసాయి సేవలు ప్రపంచవ్యాప్తంగా కీర్తించబడుతున్నారని సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ మన్యం పర్వత వర్ధనరావు తెలిపారు. స్థానిక శ్రీ సత్యసాయి సేవా పుష్పం సేవాకేంద్రం నందు ఏర్పాటు చేసిన స్వచ్ఛత నుండి దివ్యత్వం అనే జాతీయ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఉభయ పాఠశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్లు చిర్ల కనికిరెడ్డి, గొలుగూరి సత్యనారాయణ రెడ్డిలు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సత్యసాయి చిత్ర పటానికి పూల మాలలు వేసి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రావులపాలెం గ్రామ పంచాయితీలో పనిచేయుచున్న 82 మంది పారిశుద్య కార్మికులకు దుప్పట్లు, టోపీలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సంసందర్భముగా సమాజంలో పారిశుద్య కార్మికుల సేవలకు విలువ కట్టలేమని, వారు చేస్తున్న పారిశుద్యం వల్ల ప్రజలందరూ అనారోగ్యం బారిన పడకుండా సుఖంగా జీవించగలుగుతారని, ప్రజల సంక్షేమం కోరే ఈ కార్మికులకు ఏమి ఇచ్చినా ఋణం తీర్చుకోలేమని గొలుగూరి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. సత్యసాయి పరమాత్మకు సాయి భక్తులతో "స్వచ్ఛత నుండి దివ్యత్వం" రూపొందించి జాతీయ స్థాయిలో మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, ఇండ్లు, ఆలయాలు, సంస్థలు, పరిసరాలు స్వచ్ఛతగా ఉండేటట్లు సేవలు అందించడం వంటి పలు కార్యక్రమాలు చాలా ఆదర్శవంతమైనవని అర్థవంతమైనవని చిర్ల కినికిరెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిర్ల వెంకటరెడ్డి, నడింపల్లి రామకృష్ణంరాజు, చిన్నం తారక రామారెడ్డి, కొవ్వూరి విజయేంద్రరెడ్డి, చెక్కా సూర్య ప్రకాష్, ఎస్‌విఎస్ రెడ్డి, కోనాల భాస్కరరెడ్డి, కొవ్వూరి వివేకానందరెడ్డి, మన్యం పర్వత వర్ధనరావు తదితరులు సేవలు అందించినవారిలో ఉన్నారు.

# కాల్ లెటర్స్ పంపారు...కాదు పొమ్మన్నారు

ఆవేదన వ్యక్తం చేసిన బిఎస్సీ నర్సింగ్ అభ్యర్థులు



కాకినాడ : కాల్ లెటర్స్ పంపారు తీరా...సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు వెళితే కాదు పొమ్మన్నారని గ్రామ/వార్డు సచివాలయం ఎఎన్ఎం/ వార్డు హెల్త్ సెక్రటరీ గ్రేడ్-3 ఫిమేల్ పోస్టులకు పరీక్ష రాసి అర్హత పొందిన బిఎస్సీ నర్సింగ్ అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేసారు. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు 3వ తేదీన కాకినాడ ఆర్ఎంసీ ఆడిటోరియంకు రావాలని కాల్ లెటర్స్ వచ్చాయని ఉద్యోగం వచ్చిందని ఎంతో ఆనందంతో జిల్లాఅధికారుల ముందు తమ సర్టిఫికెట్స్‌తో హాజరైతే మీరు అర్హులు కాదంటూ తమను బయటకు పంపారని వాపోయారు. అరుహలని కాల్ లెటర్స్ పంపి తీరా వచ్చిన తర్వాత జిల్లా వైద్య ఆరోగ్య అధికారుల ఈ విధంగా చేయడం ఎంత వరకు సబబుఅని అర్హత పొందిన బిఎస్సీ నర్సింగ్ అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలెక్షన్ లిస్ట్ వరకు లేని అభ్యంతరం సర్టిఫికేట్ పరిశీలనలో ఎందుకు వచ్చాయంటూ ఆవేదన వ్యక్తం చేసారు. ఇటీవల నిర్వహించిన గ్రామ సచివాలయం సిబ్బంది నియామకం కొరకు ఇచ్చిన ప్రకటనలో నర్సింగ్ సెక్రటరీ పోస్ట్ కూడా ఉంది.ఈ ఉద్యోగాలకు బి.ఎస్సీ నర్సింగ్ చదివిన అభ్యర్థులు కూడా పరీక్షలు వ్రాసి అర్హత పొందారు.వీరికి గురువారం స్థానిక ఆర్.ఎం.సీ ఆడిటోరియంలో ధ్రువపత్రాలు పరిశీలనకు రావాలని కాల్ లెటర్స్ పంపారు.కేంద్రానికి చేరుకున్న అభ్యర్థులకు చేదు అనుభవం ఎదురైంది.ఈ ఉద్యోగాలకు నర్సింగ్ బి.ఎస్సీ అభ్యర్థులు అర్హులు కారని అక్కడి అధికారులు చెప్పడంతో వారంతా అవాక్కయ్యారు. తాము దరఖాస్తు చేసుకుని పరీక్షలు వ్రాసి ఉద్యోగాలకు అర్హత సాధించామని ఇప్పుడు ప్రక్కన పెడితే తమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# విద్యార్థులను ప్రోత్సహించాలి: జిల్లా కలెక్టర్ డి. మురళీధర్ రెడ్డి

కాకినాడ: వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న ఎస్.సి., ఎస్.టి., బిసి గిరిజన విద్యార్థులను, విద్యలో ప్రోత్సహించుటకు జిల్లా లో గల వివిధ కంపెనీలు, సంస్థలు, దాతలు ముందుకు వచ్చి తమ చేయూత నివ్వాలని జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి కోరారు. గురువారంనాడు కాకినాడ కలక్టరేట్ లో రిలయన్స్ ఇండస్ట్రీస్ , గాడిమొగ 25 లక్షల రూపాయలు విలువ చేసే మూడు వేల నీల్ కమల్ కుర్చీలు, 800 ఫ్యాన్లు అందజేయగా జిల్లా కలక్టరు మురళీధర్ రెడ్డి జెండా ఊపి వాహనాన్ని వసతి గృహాలకు పంపించారు. ఈ సందర్భంగా కలక్టరు మాట్లాడుతూ రిలయన్స్ ఇండస్ట్రీస్ సేవా భావంతో వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు సహకారమిచ్చారని కలక్టరు కొనియాడారు ప్రభుత్వ సహాయంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వివిధ కంపెనీలు ముందుకు వచ్చి పేద విద్యార్థులకు విద్యోన్నతికి సహాయ సహకారాలు అందజేయాలని ఆయన సూచించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్, గాడిమొగ హెచ్.ఆర్.పి. సుబ్రహ్మణ్యం ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రిలయన్స్ పరిశ్రమ సామాజిక బాధ్యతలో భాగంగా పేద విద్యార్థుల సౌకర్యార్థం 25 లక్షల రూపాయలు విలువ చేసే కుర్చీలు, ఫ్యాన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

ఈ కుర్చీలు, ఫ్యాన్ లు ఎస్.సి., బిసి, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ హాస్టల్స్, విభిన్న ప్రతిభావంతులు, మహిళా శిశు సంక్షేమ హాస్టల్స్ కు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలక్టరు జి.లక్ష్మిశ, జేసి-2 జి.రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

# మొన్న పాములు వదలండి.. నేడు కాళ్లలోకి కాల్చండి..

# ట్రంప్ మరో తుగ్లక్ నిర్ణయం!



పాలకులు తీసుకునే తుగ్లక్ నిర్ణయాలు ఎలాంటి ఇబ్బందులకు గురిచేస్తాయోననే విషయం పలు సందర్భాల్లో ప్రజలకు స్పష్టమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం మితి మీరిన నిర్ణయాలతో ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ జాబితాలోకి చేరిపోతున్నాడా అనే అనుమానం మరింత బలపడుతున్నది. ఈ మధ్య కాలంలో అమెరికాలో వలసవాదులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొనే నిర్ణయాలు అక్కడి అధికారులను, ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. తాజాగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలు స్థానికంగా దుమారం లేపుతున్నాయి.

ఇంతకు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఏమిటంటే.. ప్రపంచం వినింది..కానీ జైశంకర్ వినలేదు: ట్రంప్ గురించి మోడీ ఆ స్లోగన్ ఇవ్వలేదా ? వలసవాదులపై తుగ్లక్ నిర్ణయాలు వలసవాదులపై తుగ్లక్ నిర్ణయాలు వలసవాదులను అరికట్టాలంటే మెక్సికోతో ఉన్న 2 వేల కిలోమీటర్ల సరిహద్దు వెంబడి గోడ కట్టాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అధికారులకు ముచ్చెటమటలు పట్టించడమే కాకుండా ఆశ్చర్యానికి గురిచేశాయి. గోడ కట్టడం వల్ల ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయనే విషయాన్ని అధికారులు స్పష్టం చేశారు. సరిహద్దు ఇరువైపుల నుంచి వచ్చే విద్యార్థులకు సమస్యలు సృష్టిస్తాయని, పర్యాటకులు ముఖం చాటేయ్యడానికి అవకాశం ఉంది.

దాంతో ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.

మెక్సికో సరిహద్దులో మెక్సికో సరిహద్దులో అధికారులు సూచనతో సందిగ్ధంలో పడిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. మెక్సికో సరిహద్దు వెంట ఉండే కాలువల్లో నీళు నింపాలని, సరిహద్దు వెంట పాములు, మొసళు వదలాలని సూచించడంతోపాటు గోడకు విద్యుత్ తీగలు పెట్టాలని, ఇలా రకరకాలకు సలహాలు ఇవ్వడంతో అధికారులకు దిమ్మతిరిగినంత పనైంది. దాడి చేస్తే కాళ్లలోకి కాల్చండి దాడి చేస్తే కాళ్లలోకి కాల్చండి ఇక తాజాగా ట్రంప్ మరో ముందుడుగు వేసి వలసవాదులు దేశంలోకి చొరబాడేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరించాలని ఆదేశించాడు.

చొరబాటు దారులు, వలసవాదులు దేశంలోకి ప్రవేశించకుండా అడ్డుకొంటే వలసవాదులు రాళ్ల దాడి చేసే ప్రమాద ఉందని అధికారులు సూచించగా.. దానిపై స్పందిస్తూ వారి కాళ్లపైకి సైనికులు తుపాకి గురిపెట్టి కాల్చాలని ట్రంప్ చెప్పడంతో అధికారులు నివ్వెరపోయారు.

ట్రంప్ ఆత ృతపై అధికారులు ట్రంప్ ఆత ృతపై అధికారులు ఇలా ట్రంప్ వ్యాఖ్యలపై అధికారులు తలోరకంగా సూచిస్తున్నారు.

వలసవాదులకు చెక్ పెట్టేందుకు అధ్యక్షుడు ట్రంప్ చాలా ఆత ృతతో ఉన్నారు. అందుకే విపరీతమైన నిర్ణయాలు తీసుకొనే పనిలో పడ్డారు. ఇలాంటి తీవ్ర నిర్ణయాలు ఇబ్బందికి గురిచేసే అవకాశం ఉంది అని థామస్ డీ హెూమన్ అనే అధికారి వ్యాఖ్యానించారు.

# కాకినాడలో కో-ఆప్టెక్స్ వస్త్ర ప్రదర్శన

కాకినాడ: వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన సమాచార పౌరసంబంధ శాఖ డిడి ఎం.ఫ్రాన్సిస్. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం చేనేత సహకార సంస్థ కో- ఆప్టెక్స్ ఆధ్వర్యంలో కాకినాడలోని శ్రీ పైండ చలమయ్య సత్రంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను సమాచార శాఖ ఉపసంచాలకులు ఎం.ఫ్రాన్సిస్ గురువారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎం.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలోని చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన చేనేత వస్త్రాలు ఈ ప్రదర్శనలో లభ్యం అవుతాయని, చేనేత వస్రాలను ప్రోత్సహించడం ద్వారా దీని పై ఆధార పడ్డ చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. చేనేత వస్త్రాలు ధరించడం ఆరోగ్యకరమని, ఆహ్లాదకరమని ఈ సందర్భంగా ఎం.ఫ్రాన్సిస్ అన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనలో కోయంబత్తురు ప్రాంతాలకు చెందిన చేనేత వస్త్రాలను అందుబాటులో ఉంచారని , ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఇన్ చార్జి ఎస్.ప్రభు మాట్లాడుతూ ఈ చేనేత వస్త్రాల ప్రదర్శనలో కాంచిపురం పట్టుచీరలు, అరనీ పట్టు చీరలు, ఆర్గానిక్ కాటన్ చీరలు , పాలసిక్ చీరలు, కుర్తీలు, చుడీదారు మెటీరియల్, బెడ్ షీట్స్ , కార్పెట్స్ అందుబాటులో ఉంటాయని, ఈ వస్త్రాల పై 30 శాతం తగ్గింపు కూడా అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ వస్త్ర ప్రదర్శన గురువారం నుండి ఈ నెల 11వ తేదీ వరకు ఉంటుందని అన్నారు. ఈ ప్రదర్శన ఉ. 10 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మెన్ ఎస్.ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్ వెళ్లనున్న మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్



హైదరాబాద్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్.. పాకిస్థాన్ వెళ్లనున్నారు. కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్ ప్రారంభోత్సవ వేడుకలో ఆయన పాల్గోనున్నారు. నవంబర్ 9వ తేదీన ఈ వేడుక జరగనున్నది. మాజీ ప్రధాని మన్మోహన్‌తో పాటు పంజాబ్ సీఎం మరీందర్ సింగ్ కూడా కర్తార్‌పూర్ వెళ్లనున్నారు. కొన్ని రోజుల క్రితం కర్తార్‌పూర్ ప్రారంభోత్సవానికి రావాలంటూ మన్మోహన్‌కు ఆహ్వానం అందింది. అయితే ఆ వేడుకలో పాల్గొనేందుకు మన్మోహన్ వెళ్లడం లేదని కాంగ్రెస్ వర్గాలు మొదట్లో వెల్లడించాయి. దీనిపై ఇవాళ మరో క్లారిటీ వచ్చింది. అఖిల పక్ష పార్టీ నేతలతో కలిసి పాక్‌కు మన్మోహన్ వెళ్లనున్నట్లు తాజాగా తెలిసింది. గురునానక్ 550వ జయంతి వేడుకల్లో మాజీ ప్రధాని మన్మోహన్ పాల్గొంటారు. పంజాబ్‌లోని సుల్తాన్‌పూర్ లోద్‌లో జరిగే ఈవెంట్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్‌తో పాటు ప్రధాని మోదీ కూడా పాల్గొంటారని తెలిసింది. పాక్‌కు వెళ్తారని వస్తున్న వార్తలను పంజాబ్ సీఎం మరీందర్ సింగ్ ఖండించారు. కర్తార్‌పూర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లడం లేదని అమరీందర్ స్పష్టం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా వెళ్లారని ఆయన అన్నారు.

# సైరా బాక్సాఫీస్ ప్రభంజనం..

# రూ.100 కోట్ల క్లబ్‌లోకి మెగా మూవీ



సైరా చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ కలెక్షన్లను రాబడుతూ బాక్సాఫీస్ వద్ద అలజడి స ృష్టిస్తున్నది. మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లోనే ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ఈ చిత్రం రికార్డు స్థాయి థియేటర్లలో రిలీజైంది. తెలుగు రాష్ట్రాలు, దక్షిణాది, ఉత్తరాది, ఓవర్సీస్ అనే తేడా లేకుండా అన్ని చోట్ల భారీ కలెక్షన్లు రాబడుతున్నది. తొలిరోజు ఎంత మేరకు వసూళ్లు రాబట్టిందంటే.. నైజాం, సీడెడ్‌లో నైజాం, సీడెడ్‌లో తెలుగు రాష్ట్రాల్లో తొలి రోజు ప్రభంజనం సాగింది. ముఖ్యంగా నైజాంలో భారీ వసూళ్లను రాబట్టింది. నైజాంలో రూ.8.1 కోట్ల వసూళ్లను కలెక్ట్ చేసింది. సీడెడ్‌లో రూ.5.91 కోట్లు, ఉత్తరాంధ్రలో రూ.4.72 కోట్లు వసూలు చేసింది. ఈ ఏరియాలో సింగిల్ డే రికార్డులను నెలకొల్పడం గమనార్హం. ఆంధ్రాల్లో ఆంధ్రాల్లో ఇక ఆంధ్రాలో తూర్పు గోదావరి జిల్లాలో రూ.5.43 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.4.5 కోట్లు, గుంటూరులో రూ.5.06 కోట్లు, క ృష్ణా జిల్లాలో రూ.3.03 కోట్లు, నెల్లూరులో రూ.2.09 కోట్లు వసూలు చేసింది. దీంతో మొత్తంగా తెలుగు రాష్ట్రాల్లో రూ.38.75 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. దక్షిణాది రాష్ట్రాల్లో 24 దక్షిణాది రాష్ట్రాల్లో ఇక దక్షిణాది రాష్ట్రాల్లో కూడా వసూళ్ల సునామీ కొనసాగింది. తొలిరోజు కర్ణాటకలో రూ.6.40 కోట్లు, తమిళంలో రూ.60 లక్షలు, కేరళలో రూ.32 లక్షలు వసూలు చేసింది. ఇక హిందీలో రూ.1.4 కోట్లు రాబట్టింది. వారాంతంలో ఈ వసూళ్లు పెరిగే అవకాశం ఉంది. ఓవర్సీస్‌లో ఓవర్సీస్‌లో ఇక అమెరికా, కెనడాలో కూడా భారీ కలెక్షన్లు బాక్సాఫీస్‌ను కుదిపేసాయి. ఈ రెండు ప్రదేశాల్లో రూ.4.25 కోట్లు వసూలు చేసింది. మిగితా దేశాల్లో రూ.2 కోట్లు రాబట్టింది. మొత్తంగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 53.72 కోట్ల నెట్, రూ.85 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. రెండో రోజుకు రూ.100 కోట్ల రికార్డును సునాయసంగా అధిగమించే అవకాశం కనిపిస్తుంది.





# అతను నాలా ఉండకూడదు: కాజల్ అగర్వాల్





వైజాగ్ : హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మల్టీ-బ్రాండ్ మొబైల్ రిటైల్ చైన్ హ్యాపీ మొబైల్స్, విశాఖలో మరో షోరూంను ప్రారంభించింది. ప్రముఖ సినీ నటి కాజల్ అగర్వాల్ గురువారం దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినియోగదారులు ఈ (అక్టోబర్) నెలలో దసరా, దీపావళి సందర్భంగా హ్యాపీ మొబైల్స్ స్టోర్స్ లో మెగా ఫెస్టివల్ ధమాకా అందిస్తోంది. ప్రతీ మొబైల్పై ఉచిత బహుమతి పొందేందుకు అయిదు కోట్ల విలువైన బహుమతులును సిద్ధంగా ఉంచినట్టు హ్యామీ మొబైల్స్ సీఎండీ క ృష్ణ పవన్, డైరక్టర్ కోట సంతోష్ తెలిపారు. పది వేల రూపాయల పైబడి మొబైల్ కొన్న కస్టమర్లకు వారి పుట్టిన రోజున అక్షయ్య పాత్ర ద్వారా నిరుపేదలకి ఉచిత భోజనం సదుపాయాన్ని అందివ్వనున్నట్టు వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఇప్పటివరకు 57 స్టోర్స్ ప్రారంభించామనీ తద్వారా పది లక్షల కస్టమర్లకి చేరువయ్యామని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ విశాఖ రావడం ఆనందంగా ఉందన్నారు. హ్యాపీ మొబైల్స్ తొలి షోరూమ్ ప్రారంభించడం సంతోషంగా ఉందనీ, అలాగే కస్టమర్లకి భారీ డిస్కౌంట్ లు అందించడం హ్యాపీగా ఉందని పేర్కొన్నారు. విశాఖ ప్రజలు, ఇక్కడి ఫుడ్ తనకు చాలా ఇష్టమని తెలిపారు. విశాఖలోఎన్నో సినిమా షూటింగ్లలో పాల్గొన్నానంటూ ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. అలాగే క్వీన్ తమిళ రీమేక్ లో కష్టపడి నటిస్తున్నాననీ, హిందీతో పాడు తమిళ వెబ్ సిరీస్ లో నటిస్తున్నానంటూ తన ఫ్యూచర్ ప్రాజెక్టుల వివరాలందించారు. తన సహనటులందరితోనూ తనకు మంచి సంబంధాలున్నాయని తెలిపారు. అంతేకాదు తనకు నచ్చిన వ్యక్తి దొరికితే తప్పకుండా పెళ్లి చేసుకుంటానంటూ కాజల్ తన అభిమానుల్లో హుషారు నింపారు. అయితే తనకు కాబోయే వరుడు తనలాగా కాకుండా డిఫరెంట్‌గా వుండాలని వ్యాఖ్యానించి నవ్వులు పూయించారు.



సైరా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలై అఖండ విజయాన్ని నమోదు చేసింది. మెగాస్టార్ చిరంజీవి ఉయ్యాల వాడ నరసింహారెడ్డి పాత్రలో జీవించేశాడు. వెండితెరపై సైరాగా చిరు తన నట విశ్వరూపం చూపించాడు. అభిమానులు బ్రహ్మరథం పడుతున్న ఈ మూవీ కలెక్షన్లలో కొత్తరికార్డులు క్రియేట్ చేసేలా కనిపిస్తోంది. ఇంత మంచి స్పందన వస్తుండటంతో చిత్రయూనిట్ ప్రేక్షకులకు థ్యాంక్యూ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో తమన్నా మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. లక్ష్మీ పాత్రలో తమన్నా .. లక్ష్మీ పాత్రలో తమన్నా .. లక్ష్మీ పాత్రలో తమన్నా నటనకు అన్ని వైపుల నుంచి మంచి స్పందన రావడంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. థ్యాంక్యూ మీట్లో మాట్లాడుతూ.. ఈ పాత్రలో తన నటనకు ప్రత్యేకప్రశంసలు లభిస్తున్నాయని, చిరంజీవి నుంచి ఆ ప్రశంసలు రావడం తనకెంతో సంతోషమనిపించిందని తెలిపింది. తనను అవంతికి, నిహారిక అని తన రోల్స్ ను బట్టి పిలుస్తుంటారని.. అయితే ప్రస్తుతం లక్ష్మీ నరసింహా రెడ్డి అని పిలుస్తారని అది చాలని పేర్కొంది.

చిరంజీవి గారెంతో సింపుల్గా ఉంటారని, ఆయనొక మెగాస్టార్ అని, ఆయన గురించి తెలుసుకోవాలంటే.. ఇంకా కొన్ని సినిమాలు చేయాలనకుంటున్నానని తెలిపింది. పక్కనే ఉన్నచిరంజీవికి కూడా.. తన కోరికను చెప్పుకుంది. మీరు తరువాత చేయబోయే సినిమాల్లో కూడా అవకాశమివ్వమని తమన్నా కోరింది. ఒక్క షాట్ కోసం పిలిచినా వస్తా.. ఒక్క షాట్ కోసం పిలిచినా వస్తా.. సూరీ నీకు మళ్లీ మళ్లీ చెబుతున్నా.. నువ్వు

# ఒక్క షాట్ కోసం పిలిచినా వస్తా అనేసిన తమన్నా

ఒక్క షాట్ కోసం పిలిచినా నేను వస్తా అంటూ తమన్నా పేర్కొంది. జగపతి బాబు గారికి చెప్పినట్లు తనకు చెప్పొద్దని.. ఎంత చిన్నపాత్ర అయినా చేస్తానని చెప్పుకొచ్చింది. ఇక రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ.. నీ గురించి ఏం చెప్పాలిరా? నువు నటించడంలో గొప్పా? ప్రొడ్యూసర్ గా బెస్టా? అనేది చెప్పలేకపోతున్నా.. చరణ్ నాకు ఎప్పటి నుంచో తెలిసినందుకు నాకు ఆనందంగా ఉంది. లక్ష్మీపాత్రకు తనను ఎంచుకున్నందుకు ధన్యవాదాలు అంటూ తెలిపింది.

అందంగా కనిపించడానికి కారణం వారే.. అందంగా కనిపించడానికి కారణం వారే.. ఈ సినిమా అంత అందంగా కనిపించడానికి కారణం.. క్యాస్ట్యూమ్ డిజైనర్ సుష్మితా. తనతో మరిన్ని ప్రాజెక్ట్స్ చేయాలని కోరకుకుంటున్నాను. ప్రతీ రోజూ తనతో కలసి పని చేయడం.. క్యాస్ట్యూమ్స్ గురించి డిస్కషన్ చేయడం.. అదంతా ఒక అద్భుతమైన ప్రయాణమని, భవిష్యత్తులో కూడా నీతో పనిచేయాలని కోరుకుంటున్నాను. తనను అంత అందంగా చూపినంచినందుకు కెమెరెమెన్ రత్నవేలుకు ధన్యవాదాలు తెలిపింది.

ఈ సినిమాకు సంగీతం అందించిన అమిత్ త్రివేదికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. సైరా పాట ఇంకా తన చెవులకు వినిపిస్తూనే ఉందని, ఈ మూవీకి అతని సంగీతం పెద్ద బలమని తెలిపింది.



# ప్రారంభమైన సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ ఖోఖో పోటీలు

**క్రీడలకు పుట్టినిల్లు శ్రీకాకుళం**
**యువతకు క్రీడలు, విద్య అవసరం**
**క్రీడలు దేశ సమైక్యతకు దోహదం**
**ఖోఖోలకు ఆతిధ్యం ఇవ్వడం ఆనందంగా ఉంది**
**రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్**

**క్రీడలు కుల, మతాలకు అతీతం**
**శ్రీకాకుళం జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుల అనేక మంది ఉన్నారు**
**రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్**



శ్రీకాకుళం : సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ ఖోఖో పోటీలు గురు వారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్ సమక్షంలో రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ శ్రీకాకుళంలోగల డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో పోటీలను ప్రారంభించారు. డా.బి.ఆర్.విశ్వవిద్యాలయం సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ ఖోఖో మహిళా ఛాంపియన్‌షిప్ పోటీలకు ఆతిధ్యం ఇస్తోంది. మంత్రులు క్రిష్ణదాస్, ముత్తంశెట్టి శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని, డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయ పతాకాన్ని, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ క్రీడలలో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన 57 విశ్వవిద్యాలయాల నుండి 800కు పైగా మహిళా క్రీడాకారులు పాల్గొంటున్నారు. క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడలు దేశ సమైఖ్యతకు దోహదం చేస్తున్నాయన్నారు. దేశ భక్తిని పెంపొందించడంలో క్రీడలు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. క్రీడలు కుల,మతాలకు అతీతమని క్రీడాకారులకు దేశం యావత్తు అండగా నిలుస్తుందని అన్నారు. క్రీడాకారులు అపారమైన ఆత్మస్థైర్యాన్ని, విశ్వాసాన్ని కలిగి ఉంటారని పేర్కొన్నారు. యువత క్రీడల్లో రావాలని తద్వారా దేశ భవితకు గట్టి పునాదులు పడతాయని యన్నారు. క్రీడల వలన శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని మంత్రి అన్నారు. రాష్ట్రంలో క్రీడలకు పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని పేర్కొంటూ అదే స్థాయిలో ప్రామాణికమైన విద్యను అందించుటకు కృషి చేస్తున్నామన్నారు. జాతీయ స్థాయి క్రీడలలో బంగారు పతకాలను పొందిన వారికి రూ.5 లక్షలు, రజత పతాకాలు పొందిన వారికి రూ.3 లక్షలు, కాంస్య పతాకాలు పొందిన వారికి రూ.2 లక్షలు చొప్పున పారితోషికం అందించుటకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుల అనేక మంది ఉన్నారని చెప్పారు.

రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములకు ప్రాధాన్యత ఇవ్వకుండా క్రీడలలో పాల్గొనడమే ప్రత్యేక ధ్యేయంగా ఉండాలన్నారు. శ్రీకాకుళం జిల్లా క్రీడలలో ప్రముఖ స్థానంలో ఉందన్నారు. క్రీడలకు పుట్టినిల్లు శ్రీకాకుళం అన్నారు. జిల్లా మంచి సాంప్రదాయం, సంస్కృతి, కళలు కలిగిన జిల్లా అన్నారు. జిల్లా నుండి చక్కని ఆతిధ్యం పొంది మధుర స్మృతులతో వెళ్ళాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో కొద్ది రోజులలోనే సి.యం కప్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఛాంపియన్‌షిప్, సబ్ జూనియర్ బాడ్మింటన్ టోర్నమెంటు, వెటరన్ స్విమ్మింగు ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించామన్నారు. పార్లమెంటు సభ్యులు బెల్లాన చంద్రశేఖర రావు మాట్లాడుతూ యువతకు, సమాజానికి క్రీడలు, విద్య అవసరమన్నారు.

శాసన సభ్యులు గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు ఎచ్చెర్ల నియోజకవర్గంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

జిల్లా కలెక్టర్ జె శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి అవసరమన్నారు. క్రీడా ప్రతిభతో చక్కని వాతావరణంలో పాల్గొనాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. కూన రాంజీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని, అందులో భాగంగా క్రీడలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామన్నారు. సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ ఖోఖోలకు ఆతిధ్యం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రధాన ఆచార్యులు ప్రొ. కామరాజు, ప్రొ. సుజాత, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి పి. సుందర రావు, వివిధ విశ్వవిద్యాలయాల అధికారులు పాల్గొన్నారు.




## హిందీ ప్రచారంలో తెలుగు సాహిత్యం కీలకం

హైదరాబాద్: హిందీభాషకు సరైన ప్రచారం, ప్రాధాన్యత పెరగడంలో తెలుగు సాహిత్యం పాత్ర కీలకం అని చెప్పడంలో ఎలాంటి సందేహం అవసరం లేదని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు స్పష్టంచేశారు. హిందీ ప్రచార్ సభ ద్వారా హైదరాబాద్ కూడా ముఖ్యమైన పాత్ర పోషించినందు వల్లనే, రాజ్యసభ హిందీసలహాకార్ సమితి సమావేశాన్ని తొలిసారిగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని అన్నారు. దక్షిణభారత సంస్కృతికి హైదరాబాద్ ముఖద్వారం, భిన్నసంస్కృతులు, భాషలకు కేంద్రమని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. తెలుగుతోపాటు హిందీ, ఉర్దూ భాషలకూ ఇక్కడ తగిన గౌరవం ఉందన్నారు. గురువారం నగరంలోని దసపల్లాహోటల్‌లో ఏర్పాటు చేసిన రాజ్యసభ హిందీసలహాకార్ సమితి 8వసమావేశాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీయేతర ప్రాంతాల్లో ఈ సమితి సమావేశాలు నిర్వహించాలని గతేడాది సమావేశంలో నిర్ణయించామన్నారు. ఇకపై ఇతర ప్రాంతాల్లోనూ సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలోని అన్ని ప్రాంతీయ భాషలకూ సమ ప్రాధాన్యత ఇస్తూనే దేశాన్నిఏక తాటిపై తీసుకొచ్చే హిందీభాషను నేర్చుకోవల్సిన అవసరం ఉందన్నారు. ఈ భాషను ఎవరిపైనా బలవంతంగా రుద్దే ఆలోచన లేదని, హిందీ నేర్చుకోవాలా? వద్దా? అనేది వ్యక్తిగత విషయమని అన్నారు. అయితే హిందీ నేర్చుకోవడం వవల్ల లాభమే తప్ప నష్టం లేదని ఆయన స్పష్టంచేశారు. హిందీని వ్యతిరేకించడం, దీనిపై అవసర వివాదాలు సృష్టించే ప్రయత్నం సరికాదని ఉపరాష్ట్రపతి అన్నారు. 1918లో మహాత్మాగాంధీ మద్రాసులో దక్షిణ్ భారత్ హిందీ ప్రచార్‌సభను స్థాపించి మరణించేవరకూ అధ్యక్షుడిగా ఉన్నారని గుర్తుచేశారు. 1935లో హైదరాబాద్‌లోనూ గాంధీజీ హిందీ ప్రచార్ సభను స్థాపించిన విషయాన్ని కూడా రాష్ట్రపతి గుర్తుచేశారు. భిన్న భాషలను మాట్లాడే భారత్ వంటి పరిస్థితులు ఏ దేశంలోనూ లేవని, అందుకే హిందీతోపాటుగా ఇతర భాషలకు కూడా సమాన గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ శ్రీహరివంశ్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు కె.కే శవ రావు, సంతోష్‌కుమార్, సుజనాచౌదరి, సత్య నారాయణ జటియా, ప్రొఫెసర్ మనోజ్‌ఝా, రవిశంకర్‌వర్మ, హుస్సేని దల్వాయ్, సెక్రటరీ జనరల్ దేశ్ దీపక్‌వర్మతోపాటుగా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఏపీలో పెట్టుబడులకు సానుకూలం వాతావరణం

**శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం**



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సానుకూల వాతావరణం ఉందని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. అమరావతిలో స్విట్జర్లాండ్ భారత రాయబార బృందంతో గురువారం ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో పారిశ్రామిక అభివృద్ధికి కావాల్సిన వనరులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అన్ని రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని సూచించారు. పారిశ్రామిక అభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వం కొత్త పాలసీని రూపొందిస్తోందని తమ్మినేని సీతారాం అన్నారు. కాగా ఈ భేటిలో స్విట్జర్లాండ్‌కు చెందిన పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# విశాఖపట్నం టెస్టులో రెండో రోజు ముగిసిన ఆట

**తొలి ఇన్నింగ్స్‌ని 502/7తో డిక్లేర్ చేసిన టీమిండియా**
**మొదటి ఇన్నింగ్స్ ఆరంభంలో మూడు వికెట్లు చేజార్చుకున్న సఫారీలు**
**అశ్విన్ దెబ్బకి ఆఖరి సెషన్‌లో హడలెత్తిన దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌లు**



విశాఖపట్నం : వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌పై భారత్ జట్టు పట్టు బిగించింది. ఆటలో రెండో రోజైన గురువారం తొలి ఇన్నింగ్స్‌ని 502/7తో డిక్లేర్ చేసిన టీమిండియా.. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికాని ఈరోజు ఆట ముగిసే సమయానికి 39/3తో ఒత్తిడిలోకి నెట్టింది. ప్రస్తుతం క్రీజులో డీన్ ఎల్గర్ (27 బ్యాటింగ్: 63 బంతుల్లో 2X4, 1X6), బవుమా (2 బ్యాటింగ్: 7 బంతుల్లో) ఉండగా.. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా ఇంకా 463 పరుగులు భారత్ కంటే వెనకబడి ఉంది.

వైజాగ్ పిచ్ సాధారణంగా మూడో రోజు నుంచి స్పిన్నర్లకి అనుకూలించనుంది. కానీ.. అనూహ్యంగా రెండో రోజు ఆఖరి సెషన్‌లోనే భారత్ స్పిన్నర్లు అశ్విన్, జడేజా టర్న్ రాబట్టారు.

దీంతో.. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌లకి క్రీజులో నిలవడమే కష్టంగా మారింది. ఓపెనర్ ఆడిల్ మార్క్రమ్ (5) అశ్విన్ దెబ్బకి 8వ ఓవర్‌లోనే పెవిలియన్‌కి చేరిపోగా.. అనంతరం వచ్చిన బ్రుయాన్ (4) కూడా అశ్విన్ విసిరిన బంతిని హిట్ చేయబోయి కీపర్‌కి దొరికిపోయాడు.

ఇక డేన్ పైడ్ (0) అయితే.. మరీ ఘోరం. జడేజా విసిరిన బంతిని డిఫెన్స్ చేసేందుకు డేన్ ప్రయత్నించగా.. అతని బ్యాట్ పక్క నుంచి వెళ్లిన బంతి నేరుగా వెళ్లి మిడిల్ స్టంప్‌ని గిరాటేసింది. పిచ్ స్పిన్నర్లకి అనుకూలిస్తున్న నేపథ్యంలో.. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌లు శుక్రవారం ఏ మేరకు పోటీనిస్తారో..? చూడాలి.

## శ్రీ శారదాపీఠంలో అన్నపూర్ణాదేవిగా శ్రీ శారదా స్వరూప రాజశ్యామలా అమ్మవారు

**విశేష అభిషేకాలు.. ప్రత్యేక కుంకుమ పూజలు**



పెందుర్తి: విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి వారు మరియు ఉత్తర పీఠాధిపతి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో శ్రీ శారదాపీఠ ప్రాంగణంలోగల శ్రీ శారదా స్వరూప రాజశ్యామలా శరన్నవ రాత్రి మహోత్సవాలు గురు వందనంతో ప్రారంభం అయ్యాయి. ముందుగా గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచన కార్యక్రమాలను స్వామీజీ ప్రారంభించారు. మండపారాధానాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పండితులు నిర్వహించారు. అలాగే ఉదయం చండీహోమం, శ్రీచక్రార్చన అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ శారదా స్వరూప రాజశ్యామలా అమ్మవారి శ్రీ అన్నపూర్ణా దేవిగా భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం వందలాదిమంది మహిళలు కుంకుమ పూజలలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి స్వామీజీ ఏకదశ హారతులు ఇచ్చారు. పై కార్యక్రమాలలో ఆర్‌టిఎ కమిషనర్ బలరాం రాజు, విడిఎంఆర్‌ఏ ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, సిఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే విశేషంగా తరలి వచ్చిన భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శ్రీ శారదా స్వరూపా రాజశ్యామలా అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 5వ తేదీన మూల నక్షత్రం సందర్భంగా ఉదయం నుండి సామూహిక అక్షరాభ్యాస ములు మరియు విద్యార్థిని విద్యార్థులచే సరస్వతీ పూజ నిర్వహించబడునని శారదాపీఠ నిర్వాహకులు పేర్కొన్నారు.

## శ్రీ కనక మహా లక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవములు



బురుజుపేట : విశాఖ నగరంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవములలో భాగంగా గురువారం ఉదయం శ్రీ అమ్మవారు శ్రీ సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. శ్రీ అమ్మవారి లక్ష తులసి పూజ జరిగినది. అనంతరం శ్రీచక్ర నవావర్ణార్చన జరిగినది. ఈ అలంకరణ దాతలు సీహెచ్. ఫణీంద్ర నాగపద్మ. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకొన్నాడు. శుక్రవారం శ్రీ విజయలక్ష్మీ అలంకారములో అమ్మవారు దర్శనమిచ్చేదరు. అలాగే అమ్మవారి కలువపూలు పూజ నిర్వహింపబడును.

అమ్మవారిని సమాచార హక్కు చట్టం కమీషన్ ఛైర్మన్ వి. రాజా దర్శించినారు. వారిని దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపకమీషనర్ కార్యనిర్వాహణాధికారి ఎన్.వి.ఎస్.ఎన్. మూర్తి, పర్యవేక్షకులు ఎన్.వి.వి.ఎస్.ఎస్.ఏ.ఎన్. రాజు, పి. శ్రీనివాస్, ఏ. త్రిమూర్తులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

*గమనిక:*

శ్రీదేవి శరన్నవరాత్రులు సందర్భంగా ఉ. 9.00 గం.ల నుండి సాయంత్రం 5.00 గం.ల వరకు రోజుకొక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చేదరు, ఈ సమయంలో భక్తులకు గర్భాలయి ప్రవేశం లేదు. భక్తులు గమనించి సహకరించమనవి. యదావిధిగా ఉదయం 5.00 గం.లకు పంచామృతాభిషేకం, ప్రతి శుక్రవారం జరుగు కీరాభిషేక సేవ ఉదయం 7.00 గం.ల నుండి 8.00 గం.ల వరకు మరియు సాయంత్రం 6.00 గం.లకు పంచామృతాభిషేకం నిర్వహించబడును. ఉదయం 8.00 గం.ల నుండి 9.00 గం..లవరకు శరన్నవరాత్రులలో శ్రీ అమ్మవారి అలంకరణ చేయు సమయ మునందు దర్శనములు నిలిపివేయబడును. ఈ విషయాన్ని యావన్మంది భక్తులు గ్రహించి సహకరించప్రార్థన.

*సాంస్కృతిక కార్యక్రమము:*

సాయంత్రం గం.. 6.30 ని.లకు కె. సింహాచలం, విశాఖపట్నం వారిచే భక్తిరంజనీ భక్తులను ఏంతగానో అలరించింది. ఈ కార్యక్రమములో భాగంగా శుక్రవారం జి. లలిత శ్రీనివాస్, విశాఖపట్నం వారిచే కూచిపూడి నృత్యం నిర్వహించబడును.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com